www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల : 5.00
Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 77 | గురువారం | 29 ఆగస్టు 2024

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 7288825681



## మేనిఫెస్టో హామీలకు కాంగ్రెస్ మంగళం

- కత్తిమీద సాములా పంటలు పండించడం.. విక్రయించడం
- రైతు వ్యతిరేక విధానాలు ఇప్పటికైనా వీడండి
- సీఎం రేవంత్‌కు హరీశ్ రావు లేఖ

## బెంగాల్ తగలబడితే.. మీకూ నష్టమే

- అసోం తదితర రాష్ట్రాలను హెచ్చరించిన మమత
- రేపిస్టులకు ఉరిశిక్ష బిల్లును తీసుకు వస్తామని ప్రకటన

2 లో..




## కోల్‌కతా హత్యాచార ఘటన
# విచారకరం

### నాగరిక సమాజం ఇలాంటివి అంగీకరించదు
### తొలిసారి స్పందిస్తూ తీవ్ర విచారం ప్రకటించిన రాష్ట్రపతి

**న్యూఢిల్లీ:** కోల్‌కతాలో జరిగిన ఘటనపై రాష్ట్రపతి ముర్ము విచారం వ్యక్తం చేస్తూ, మహిళలపై ఇలాంటి అఘాయిత్యాలను ఏ నాగరిక సమాజంలోనూ అనుమతించలేమని రాష్ట్రపతి అన్నారు. సమాజం కూడా నిజాయితీగా, న్యాయంగా ఉండేందుకు ఆత్మపరిశీలన చేసుకోవాలి. 2012లో ఢిల్లీ నిర్భయ కేసు మరువక ముందే దేశంలో లేక్కలేనన్ని అఘాయిత్యాలు జరుగుతుండటం బాధకరం అన్నారు. కోలకతా లో జరిగిన మరో అత్యంత దారుణమైన, హేయమైన చర్య అని రాష్ట్రపతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారిగా స్పందించారు.

మిగతా 2 లో





## ఆందోళనకరంగా రోడ్డు ప్రమాదాలు

- యుద్ధాల్లో మరణాల కంటే ఎక్కువగా ప్రమాద మృతులు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన

2 లో..

హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలపై రాజకీయ ప్రకంపనలు రేగుతున్న వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ఎప్పటికీ వెనక్కి తగ్గదని పూర్తి స్పష్టత ఇచ్చారు. తన మొదటి ప్రాధాన్యత చెరువులను కాపాడటమేనని, పార్టీలతో సంబంధం లేదని చెప్పారు. 'ఓల్డ్ సిటీ కాదు ఏ సిటీ అయినా వెనక్కి తగ్గేది లేదు' అని హెచ్చరించారు. 'హైడ్రా హైదరాబాద్‌కు మాత్రమే ఇప్పటివరకు పరిమితం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, చెరువులు నాళాలపై కూల్చివేతలకు తొలి ప్రాధాన్యత ఇస్తాం. నిబంధనలు పాటించని భవనాలను కూల్చివేస్తాం. తొలి కూల్చవేత మొదలుపెట్టిందే కాంగ్రెస్ నేత పల్లం రాజు నుంచేనని అన్నారు. కేటీఆర్ ఫామ్ హౌస్‌కి అనుమతి సర్పంచి నుంచి తీసుకున్నాం అని అంటున్నారు. జన్వాడ ఫామ్‌హౌస్ లీజుకు తీసుకున్నట్లు అఫిడవిట్‌లో కేటీఆర్ ఎందుకు ప్రస్తావించలేదు. నిర్మాణాలకు అధికారులే అనుమతి ఇస్తారు.. సర్పంచ్‌లు కాదని పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఆయనకు తెలియదా? నా కుటుంబం కబ్జా చేసినట్లు కేటీఆర్ చూపిస్తే దగ్గరుండి కూల్చివేయిస్తా. విద్యా సంస్థల ముసుగులో కబ్జా చేస్తే ఊరుకోం అన్నారు. హైడ్రా కూల్చివేతలపై ఒత్తిళ్లు వస్తున్నాయి.. అయినా ఎదుర్కొంటాం.. వెనక్కి తగ్గేది లేదని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజా ప్రయోజనాల కోసమే కూల్చివేతలు జరుగుతున్నాయి. గత పదేళ్లలో చెరువులను, నాలాలను కబ్జా చేసి కట్టినందుకు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి కేసీఆర్ సస్పెండ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.



## ఎవరిదైనా సరే..
# కూల్చేయండి

### ఆక్రమణల కూల్చివేతలపై వెనక్కి తగ్గేది లేదు

- చెరువుల పరిరక్షణ తమ తొలి ప్రాధాన్యం
- జన్వాడా లీజుకు తీసుకున్నామని అప్పుడు ఎందుకు చెప్పలేదు
- పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు అనుమతులు తెలియవా
- నా కుటుంబ కబ్జాలు ఉంటే నిర్భయంగా తెలియజేయండి
- నాలాలను కబ్జా చేసిన నేతలను కేసీఆర్ సస్పెండ్ చేయాలి
- హరీశ్ రావు ముందుకు వస్తే చెరువుల పరిరక్షణ కమిటీ వేస్తా
- మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:

సచివాలయంలో బుధవారం మీడియాతో సీఎం రేవంతరెడ్డి చిట్ చాట్ చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కేవలం ఐదు నెలల్లో కవితకు బెయిల్ ఎలా వచ్చిందని సందేహం వ్యక్తం చేశారు. మనీష్ సిసోడియాకు బెయిల్ రావడానికి 15 నెలలు సమయం పట్టిందని, సీఎం కేజ్రీవాల్‌కు ఇప్పటికీ బెయిల్ రాలేదని ఆయన ప్రస్తావించారు. కవితకు ఇంత త్వరగా బెయిల్ రావడానికి బీజేపీ మద్దతు ఉందని అనుకుంటున్నట్టు రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ కోసం బీఆర్ఎస్ పని చేసిందని, 8 సీట్లలో బీజేపీ గెలవడానికి హరీష్ రావు పనిచేశారని విమర్శించారు.

మిగతా 2 లో



## సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం

- ఏర్పాటుకు సంబంధించి భూమి పూజ
- డిసెంబర్ 9నాటికి విగ్రహావిష్కరణ
- పూజలో పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రులు


3 లో..

## జన్‌ధన్ ఖాతాలకు పదేళ్లు

### ప్రజలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేశాం
### ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ ప్రకటన

**న్యూఢిల్లీ:** దేశ ప్రజల సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' పథకానికి పదేళ్లు పూర్తయింది. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సమ్మిళిత అభివృద్ధికి తోడ్పేందుకు రూపొం దించిన ఎన్నో ఆర్థిక పథకాల్లో ఇదీ ఒకటి. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం విజయవంతం చేసిన లబ్దిదారులకు అభినందనలు తెలిపారు. 'సమ్మిళిత ఆర్థికాభివృద్ధిని పెంపొందించడంతో పాటు కోట్లాది మందికి.. ముఖ్యంగా మహిళలు, యువత, అణగారిన వర్గాలకు గౌరవాన్ని అందించడంలో ఈ పథకం అత్యంత ముఖ్యమైంది. ఇది దేశ ప్రజల గౌరవం, సాధికారత, దేశ ఆర్థిక వ్యవస్థను వృద్ధి బాటలో నడిపేందుకు ఎంతో ఉపయోగ పడింది' అని ప్రత్యేక పోస్టులో ప్రధాని పేర్కొన్నారు.

మిగతా 2 లో





2 లో..

## తెలంగాణకు అక్కరలేని విగ్రహాలను తొలగిస్తాం

మరోమారు హెచ్చరించిన కేటీఆర్

## 14తో ముగియనున్న ఆధార్ అప్‌డేట్




2 లో..

## హైదరాబాద్ చేరుకున్న కవిత

### ఘనంగా స్వాగతించిన పార్టీ శ్రేణులు

హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో బీఆర్ఎస్ శ్రేణులు గజమాలతో స్వాగతించారు. లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీలోని తీహార్ జైల్లో ఉన్న కవిత దాదాపు ఐదున్నర నెలల తర్వాత హైదరాబాద్‌కు వచ్చారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు దగ్గర బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ప్లెక్సీలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. కవిత వెంట ఆమె భర్త అనిల్, కేటీఆర్, హరీశ్ రావు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా ఆమె నివాసానికి వెళ్లారు.

మిగతా 2 లో



## ఎవరిదైనా సరే..

# కూల్చేయండి

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ – బీఆర్ఎస్ ఒప్పందం ప్రకారమే కవితకు బెయిల్ వచ్చిందని అన్నారు. అక్రమ కట్టడాలపై ప్రజా కోర్టులోనే తేల్చుకుందామని రేవంత్ రెడ్డి అన్నారు. 'నా కుటుంబ సభ్యులకు చెందిన అక్రమ కట్టడాలు ఉంటే ఆధారాలు తీసుకుని రావాలి. నేను కేటీఆర్ ఫామ్ హౌస్ అక్రమ కట్టడం అని ఆధారాలతో అక్కడికి వెళ్లాను. కేటీఆర్‌కి దమ్ముంటే నా కుటుంబ సభ్యులు లేదా నావి అక్రమ కట్టడాలు ఉంటే ఆధారాలతో రావాలి. 111 జీవోపై సుప్రీం కోర్టు, ఎన్జీటీ మార్గదర్శకాలను పాటిస్తున్నాం. చెరువులు, కుంటలలో కొన్ని భవనాలు కట్టుకోవడానికి సుప్రీంకోర్టు మినహాయింపు ఇచ్చింది. సెక్రటేరియెట్, జీహెచ్ఎంసీ లాంటి భవనాలకు సుప్రీంకోర్టు అనుమతి ఉంది. రాయదుర్గంలో కూల్చివేత సరైనదే. ఆ భూమి ప్రభుత్వ భూమి' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ కొడంగల్‌కు వెళ్తానంటే స్వాగతిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ' కేటీఆర్ కొడంగల్‌కు వెళ్లి అక్కడ రైతులతో మాట్లాడాలి. కేటీఆర్‌ను వాళ్ల తండ్రి కేసీఆర్ నమ్మడు. కర్ణాటకలో వాల్మీకి స్కామ్‌తో మాకు సంబంధం లేదు. తెలంగాణ ఖాతాలు ఉన్నంత మాత్రాన మాకు సంబంధం ఉంటుందా?. వాల్మీకి స్కామ్‌లో బీఆర్ఎస్ నేతలకే లింకులు ఉండొచ్చు. డ్రగ్స్ కోసం కొంతమంది బీఆర్ఎస్ నేతలు బెంగుళూరు వెళ్లడం అందరికీ తెలిసిందేనని సీఎం అన్నారు. నేను రేవంత్ రెడ్డినని, తనకు, కేసీఆర్‌కు పోలిక ఏంటి సీఎం అన్నారు. ' నేను కొడంగల్, కోస్గి, కొండారెడ్డి పల్లికి మాత్రమే హెడ్‌ను కాదు. రాష్ట్రానికి హెడ్‌ను నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని. కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడు. ఆయన బయటకు రావాలి ప్రజల కోసం పోరాటం చేయాలి. కేసీఆర్‌కు ప్రతిపక్ష నాయకుడు హోదాలో జీతాలు ఇస్తున్నాం. జీతం తీసుకుంటున్నందుకు ప్రజల్లో తిరగాలి. ప్రభుత్వ వ్యవస్థలను వాడుకుంటున్న ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ పనిచేయకపోతే ఎలా?' అని సీఎం పేర్కొన్నారు. రుణమాఫీపై ధర్నాలు చేసేది బీఆర్ఎస్ కార్యకర్తలేనని, బీఆర్ఎస్ ధర్నాల్లో రైతులు లేరని, వాళ్ల పార్టీ కార్యకర్తలే ఉన్నారని విమర్శించారు. 'హరీష్ రావు, కేటీఆర్ రాష్ట్రంలోని అన్ని గ్రామాలు తిరిగి రైతుల లిస్టు తయారు చేసి కలెక్టర్లకు ఇచ్చి పదేళ్లు చేసిన పాపాలను కడుక్కోవాలని సేచించారు. పార్టీలో చేరేవారు మా పాలన నచ్చి చేరుతున్నారు. మేము ఎవరిని భయపెట్టి పార్టీలో చేర్చుకోవడం లేదు. మాకు కావలసినంత బలం ఉంది. చెరువులపై హరీష్ రావుకు మంచి అవగాహన ఉంది. అందుకే ఆయన హయాంలో కమిషన్ కాకతీయ వచ్చింది. చెరువుల కబ్జాలపై నిజనిర్ధారణ కమిటీ వేద్దాం. హరీష్ రావును ముందు పెడదాం. ఎవరి కబ్జాలు ఏంటో అప్పుడు తెలుతుంది.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హరీష్ రావు దొంగ అని తనకు తెలుసునని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'రుణమాఫీపై హరీష్ రావు చేసిన సవాల్‌కు కట్టుబడి లేదు. రాజీనామా చేయకుండా హరీష్ రావు పారిపోయారు. ఓడిపోయిన దొంగ హరీష్ రావు. రుణమాఫీ అనేది నా కమిట్మెంట్ నేను చెప్పాను చేసి తీరాను. ఇచ్చిన హావిరీలపై మూడు పార్టీలు బహిరంగ చర్చలు జరుపుదాం. అన్ని పార్టీల మేనిఫెస్టోలపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చిద్దాం. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. అప్పుడు కూడా పారిపోవద్దు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ కాలేదు అంటే కేటీఆర్, హరీష్ రావు గ్రామాలు తిరగాలి. రాష్ట్రంలో అన్ని గ్రామాలు తిరిగి రైతుల ఖాతాలను లిస్టు తయారు చేసి కలెక్టర్లకి ఇవ్వాలి.

## తెలంగాణకు అక్కరలేని విగ్రహాలను తొలగిస్తాం

**మరోమారు హెచ్చరించిన కేటీఆర్**

**హైదరాబాద్, ప్రజానావ:** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. సోనియాగాంధీని దెయ్యం, పిశాచి, బలి దేవత అని అన్న నువ్వా రాజీవ్ గాంధీ విరీద ప్రేమ ఒలకబోసేది అని విమర్శించారు. దొడ్డి దారిన పీసీసీ ప్రెసిడెంట్ అయ్యి ఇవాళ రాజీవ్‌గాంధీ విరీద నువ్వు ఒలకబోస్తున్న కపట ప్రేమ అసలు రంగు అందరికీ తెలుసని అన్నారు. నీ ఆలోచనల్లో కుసంస్కారం.. నీ మాటలు అష్ట వికారం అని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి కోసం నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ నాయకుల విగ్రహాలు ఏంటని అడిగితే కారుకూతలు కూస్తావా అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన నీ చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినా అది అవమానమే అని విరుచుకుపడ్డారు. గాంధీ విగ్రహం గాడ్సే పెడితే ఎట్లుంటదో అట్లుంటది అని ఎద్దేవా చేశారు. తెలంగాణకు అక్కరకు రాని వాళ్ల బొమ్మలను తొలగిస్తాం అని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని మళ్లీ చెబుతున్నాం.. రాసి పెట్టుకో అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు. కాగా, బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతున్నందుకే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపైనా కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ముందు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

## కోల్‌కతా హత్యాచార ఘటన విచారకరం

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర విచారం వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ఈ ఘటన ఎంతో వేదనకు గురిచేసిందని, విషయం తెలిసి భయపడ్డానని ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. భారతీయ కూతుళ్లపై ఇలాంటి ఆకృత్యాలను ఏ నాగరిక సమాజం సహించదన్నారు. ఇప్పటికైనా ఈ దుర్మార్గాలను ఆపాలని ఆమె పిలుపునిచ్చారు. కొందరు వ్యక్తులు స్త్రీలను తక్కువగా, తక్కువ శక్తిమంతులుగా, తక్కువ సామర్థ్యం ఉన్నవారుగా, తక్కువ తెలివిగలవారుగా చూస్తారు. కూతుళ్లు, అక్కా చెల్లెళ్లపై ఇలాంటి అఘాయిత్యాలను ఏ నాగరిక సమాజం అనుమతించదు. ఇలాంటి అభిప్రాయాలు ఉన్నవారు స్త్రీలను ఒక వస్తువుగా చూస్తారు. భయం నుండి విముక్తి పొందేందుకు వచ్చే అడ్డంకులను తొలగించడం మన ఆడపిల్లల కర్తవ్యం అని రాష్ట్రపతి తెలిపారు. నిర్భయ తర్వాత గత 12 ఏళ్లలో జరిగిన లెక్కలేనన్ని అత్యాచారాలను సమాజం మరచిపోయిందని, ఈ సామూహిక స్మృతి సరికాదని ఆమె అన్నారు. చరిత్రను ఎదుర్కోవడానికి భయపడే సమాజాలు సామూహిక విస్మృతిని ఆశ్రయిస్తాయి. భారతదేశం చరిత్రను ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు రాష్ట్రపతి. సమాజం కొన్ని కఠినమైన ప్రశ్నలు వేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కూతుళ్లు, అక్కా చెల్లెళ్లపై ఇలాంటి అఘాయిత్యాల నుంచి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో నైట్ డ్యూటీ చేస్తున్న జూనియర్ డాక్టర్‌పై ఆగస్టు 9న అత్యాచారం జరిగింది. ఆ తర్వాత జూనియర్ డాక్టర్ దారుణ హత్యకు గురయ్యారు. వైద్యురాలి ముఖం, శరీరంపై గాయాలు కనిపించాయి. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే పోలీసుల అలసత్వం కారణంగా కలకత్తా హైకోర్టు ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించింది.

ఈ ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా వైద్యులు సమ్మెకు పిలుపు నిచ్చారు. వైద్యుల భద్రతకు సంబంధించి చట్టం చేయాలనే డిమాండ్ చేస్తున్నారు. కోల్‌కతా కేసుకు వ్యతిరేకంగా బెంగాల్‌తోపాటు దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి.

## 14తో ముగియనున్న ఆధార్ అప్‌డేట్

**న్యూఢిల్లీ:** ప్రతి పనికి ఆధార్ తప్పనిసరి కావడంతో తప్పులు లేకుండా ఆధార్ నమోదు చేసుకోవాల్సి వస్తోంది. ఆధార్ ఒక్కసారి తీసుకుంటే సరిపోదు.. ఆధార్ కార్డులో ఏవైనా తప్పులున్నా లేదా అడ్రస్ చేంజ్ చేసుకో వాలన్నా, ఫోన్ నంబర్ మార్చుకోవాలన్నా కుడా ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఇప్పటిదాకా కేంద్రం ఫ్రీగా ఆనర్‌లైన్లో ఆధార్ అప్డేట్ చేసుకునే సదుపాయం కల్పించింది. దీని గడువు త్వరలోనే ముగియనుంది. సెప్టెంబర్ 14 నాటికి ఫ్రీ ఆధార్ అప్డేట్ గడువు ముగియనుంది. ఈలోగా ఆధార్ అప్డేట్ చేసుకోని వాళ్ళు వెంటనే అప్డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

# హైదరాబాద్ చేరుకున్న కవిత

(మొదటిపేజీ తరువాయి)

లిక్కర్ స్కాం కేసులో ఈడీ, సీబీఐ కేసుల్లో ఆగస్ట్ 27న సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిం దే..153 రోజులు జైల్లో ఉన్న కవిత 27న రాత్రి 8గంటల 10 నిముషాలకు జైలు నుంచి విడుదల అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత.. న్యాయం గెలిచిందని.. తన పోరాటం కొనసాగుతుందన్నారు. ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని వ్యాఖ్యానించారు. తనను ఇబ్బంది పెట్టిన వాళ్లకు వడ్డీతో సహా చెల్లిస్తానని చెప్పారు. 28న ఉదయం లిక్కర్ స్కాం కేసులో కవిత ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టుకు వర్చువల్‌గా హాజరయ్యారు. సీబీఐ దా ఖలు చేసిన చార్జ్ షీట్ పై విచారణ జరిగింది. క్వాలిటీ డాక్యుమెంట్స్ ఇవ్వాలని నిందితుల తరపు న్యాయవాదులు కోరారు. దీంతో తదుపరి విచారణను సెప్టెంబర్ 11కు వాయిదా వేసింది కోర్టు. విచారణ అనంతరం కవిత ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరారు.



# నేరుగా ఇంటికి చేరుకున్న కవిత

- తల్లిని ఆలింగనం చేసుకుని కన్నీటి పర్యంతం
- ఓదార్చిన బంధువులు.. సన్నిహితులు
- అన్న కేటీఆర్‌కు రాఖీ కట్టిన కవిత
- నేడు ఫామ్‌హౌస్‌లో తండ్రి కేసీఆర్‌ను కలవనున్న కవిత

**ఖైరతాబాద్, ప్రజానావ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తీహార్ జైలు నుంచి విడుదలై హైదరాబాద్ చేరుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నేరుగా హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఇంటి వద్ద కవితకు దిష్టి తీసి అభిమానులు ఇంట్లోకి ఆహ్వానం పలికారు. ఇక బంధువులు, కుటుంబ సభ్యులు పూల వర్షం కురిపించి కవితకు ఘన స్వాగతం పలికారు. ఇంట్లోకి వెళ్లిన తర్వాత నేరుగా పూజ గదికి వెళ్లి దేవుళ్లకు దండం పెట్టుకున్నారు. కవితను కలిసిన వెంటనే తల్లి శోభ, ఇతర కుటుంబ సభ్యులు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. తల్లి శోభమ్మ పాదాలకు నమస్కరించి కవిత ఆశీర్వాదం తీసుకున్నారు. కూతురిని ఆప్యాయంగా హత్తుకున్నాక తల్లి శోభ కన్నీటి పర్యంతమయ్యారు. తల్లిని పట్టుకుని కవిత కూడా ఏడ్చారు. కుటుంబ సభ్యులు ఓదార్చారు. ఇక తన సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఆమె రాఖీ కట్టారు. ఢిల్లీ నుంచి శంషాబాద్‌కు చేరుకున్న కవితకు గులాబీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా గులాబీ నేతలు, కార్యకర్తలు కవితపై పూలవర్షం కురిపించగా.. పార్టీ శ్రేణులకు కవిత అభివాదం చేశారు. పడికిలి బిగించి జై తెలంగాణ అంటూ నినదించారు. కార్యకర్తల జై తెలంగాణ నినాదాలతో ఎయిర్‌పోర్ట్ దద్దరిల్లింది. ఐదునెలల తర్వాత కవిత హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, భర్త అనిల్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు ఉన్నారు. కవిత ఎయిర్‌పోర్ట్ నుంచి ర్యాలీగా బంజారాహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. గురువారం ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ చేరుకొని తండ్రి, కేసీఆర్‌ను కలుసుకోనున్నారు.

## బెంగాల్ తగలబడితే.. మీకూ నష్టమే

### పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

**కోల్‌కతా:** కోల్‌కతాలో 31 ఏళ్ల వైద్యురాలి అత్యాచారం, హత్య ఘటన పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) సర్కార్‌ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర పోలీసుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని సాక్ష్యాత్తు కలకత్తా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదిలా ఉంటే ప్రతిపక్ష పార్టీ బీజేపీ మమతా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. న్యాయం చేయాలని అక్కడి ప్రజలు చేస్తున్న ఆందోళనల్ని పోలీసులతో అణిచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంపై బెంగాల్ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఇదిలా ఉంటే, తృణమూల్ విద్యార్థి విభాగం స్థాపించిన రోజుని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో మమతా బెనర్జీ ప్రతిపక్షాలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌లో అశాంతి ఇతర రాష్ట్రాలకు కూడా తీవ్ర పరిణామాలు కలిగిస్తుందని హెచ్చరించారు. 'గుర్తుంచుకోండి బెంగాల్ తగలబడితే, అస్సాం, బీహార్, జార్ఖండ్, ఒడిశా, ఢిల్లీ కూడా తగలబడుతాయి' అని హెచ్చరించారు. శాంతిభద్రతల రక్షణలో మమతా బెనర్జీ విఫలమైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న తరుణంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. భారతదేశం, బంగ్లాదేశ్ మధ్య వ్యత్యాసాన్ని చూపుతూ రాష్ట్రాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. 'కొందరు ఇది బంగ్లాదేశ్ అని అనుకుంటున్నారు, దయచేసి గుర్తుంచుకోండి, నేను బంగ్లాదేశ్‌ను ప్రేమిస్తున్నాను, వారు మనలాగే మాట్లాడతారు, మరియు వారి సంస్కృతి మనది వలె ఉంటుంది, కానీ బంగ్లాదేశ్ ఒక ప్రత్యేక దేశం, మరియు భారత దేశం ప్రత్యేక దేశం' అని ఆమె చెప్పింది. పశ్చిమ బెంగాల్‌లో ప్రశాంతతను తాము కోరుకుంటున్నా మని మమతా బెనర్జీ అన్నారు. అత్యాచారాలకు పాల్పడే వారికి ఉరిశిక్ష పడాల్సిందేనన్నారు. వచ్చే వారంలోనే అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేసి, రేపిస్టులకు మరణశిక్ష పడేలా 10 రోజుల్లో బిల్లును ఆమోదిస్తామని తెలిపారు. బిల్లును గవర్నర్‌కు పంపిస్తామని, ఆయన ఆమోదించకుంటే రాజ్‌భవన్ ఎదుట బైఠాయింపు చేపడతామని చెప్పారు. 'బిల్లు ఆమోదించాల్సిందే. ఈసా రి గవర్నర్ జవాబుదారీతనం నుంచి తప్పించుకోలేరు' అని మమత స్పష్టం చేశారు. 'టీఎంసీ ఈవెంట్‌ను ఆర్‌జీ కర్ డాక్టర్‌కు అంకితం చేస్తున్నాం. మేము న్యాయం కోరుకుంటున్నాం. కానీ బీజేపీ ఈరోజు బంద్‌కు పిలుపు నిచ్చింది. వాళ్లు న్యాయం కోరుకోవడం లేదు. వాళ్లు కేవలం బెంగాల్‌ను అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నా రు. బంద్‌కు మేము మద్దతివ్వం. బీజేపీ ఎన్నడూ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కనీసం మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామాకు డిమాండ్ చేయలేదు. 'నబన్నా అభియాన్ ర్యాలీ' ఫోటోలు చూశా. పరిస్థితిని సమర్థవంతంగా అదుపు చేసిన పోలీసులకు నేను సెల్యూట్ చేస్తున్నాను' అని సీఎం అన్నారు. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచార, హత్యా ఘటనతో ప్రమేయమున్న నిందితుడికి ఉరిశిక్ష పడాల్సిందేనని తాను పదేపదే చెబుతున్నట్టు తెలిపారు. కాగా, విద్యార్థుల నిరసన ర్యాలీపై పోలీసు చర్యకు నిరసనగా బీజేపీ 12 గంటల బంద్‌కు పిలుపునివ్వడంపై టీఎంసీ నేత, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జి తీవ్రస్థాయిలో తప్పుపట్టారు. ఢిల్లీలో ఇంతకంటే పెద్ద నిరసన చేపడతామని బీజేపీని హెచ్చరించారు. ఉన్నావో, హత్రాస్, బద్లాపూర్ ఘటనలు జరిగినప్పుడు ఆ పార్టీ ఏమైందని అడిగారు. మహిళా భద్రత గురించి మాట్లాడే హక్కు వీరికెక్కడిదని నిలదీశారు. బీజేపీ నిరసనలతో రోడ్లపైకి వచ్చిందని, అత్యాచార వ్యతిరేక బిల్లు తీసుకురమ్మని అమిత్‌షా, జేపీ నడ్డాను అడిగే దమ్ము వారికి ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ అలాంటిదేదీ కోరుకోదని, ఎందుకంటే ఎక్కువ మంది రేపిస్టులు, గూండాలు, దుండగులు అక్కడే కన పడతారని విమర్శలు గుప్పించారు.

## ఆందోళనకరంగా రోడ్డు ప్రమాదాలు

- యుద్ధాల్లో మరణాల కంటే ఎక్కువగా ప్రమాద మృతులు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన

**న్యూఢిల్లీ:** పెద్ద సంఖ్యలో రోడ్డు ప్రమాద మరణాలపై కేంద్రమంత్రి గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో మరణాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే మృతుల సంఖ్య ఎక్కువగా ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలో ఏటా లక్షల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్న ఆయన.. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాల కారణంగానూ అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. ఫిక్కీ రోడ్ సేఫ్టీ అవార్డ్స్, కాంక్లేవ్ 2024లో పాల్గొన్న గడ్కరీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. మూడు లక్షల మంది గాయపడుతున్నారు. తద్వారా దేశ జీడీపీకి 3శాతం నష్టం వాటిల్లుతోంది. రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బలిపశువులను చేస్తారు.. కానీ, రోడ్డు ఇంజినీరింగ్‌లోనూ (డీపీఆర్) లోపాలున్నాయి' అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలోని అన్ని హైవేలకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలం టే.. లైనులో వెళ్లే క్రమశిక్షణ పాటించాలన్నారు. అంబు లెన్సులు, వాటి డ్రైవర్లకు ప్రత్యేక కోడ్‌లను ఇచ్చేందుకు తమ మంత్రిత్వశాఖ సిద్ధమవుతోందని అన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో బాధితులను రక్షించేందుకు వేగంగా స్పందించడంతోపాటు.. కట్టర్ల వంటి అధునా తన పనిముట్లను వాడకంలో వారికి శిక్షణ ఇస్తామన్నారు.

## జన్‌ధన్ ఖాతాలకు పదేళ్లు

(మొదటిపేజీ తరువాయి)

దేశంలో ప్రతి కుటుంబానికి కనీసం ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడటం జన్‌ధన్ పథకం ప్రధాన లక్ష్యం. 'విరీలో చాలా మంది ముఖ్యంగా యువత.. ఈ పథకం ఎందుకు అంత ముఖ్యమైందని ఆలోచిస్తారు..? ప్రస్తుత పరిస్థితుల్లో అన్నింటే ముఖ్యంగా ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండడం ఎంతో ముఖ్యం. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరకు దాదాపు ఎన్నో సామాన్య కుటుంబాలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేవు. దీని వల్ల సామాన్యుల సొత్తు చోరీ గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. ఆర్థిక భద్రత లేకపోవడంతో ప్రజల ఆశలు కలలుగా మిగిలేవని అన్నారు. జన్‌ధన్ యోజన ప్రారంభించినప్పుడు.. దాని చుట్టూ ఉండే సమస్యలు, సందేహాలు నాకు ఇంకా గుర్తున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం సాధ్యమవుతుందా..? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. కానీ, ఈ ప్రయత్నం మంచి మార్పునకు దారి తీస్తుందని నమ్మాను. 53 కోట్ల మందికి పైగా ప్రజలు బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్నారు. ఇది ఊహించని పరిణామం. ప్రస్తుతం ఈ ఖాతాల్లో డిపాజిట్ల బ్యాలెన్సు రూ. 2. 3 లక్షల కోట్లు. వీటిలో 65 శాతానికి పైగా గ్రావిరీణ, సెవిరీ అర్బన్ ప్రాంతాల వారు ఉండడం విశేషం. అంతేకాకుండా ఈ పథకం ద్వారా మహిళా సాధికారతను సాధించాం. దాదాపు 30 కోట్ల మందికి పైగా మహిళలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురాగలిగాం' అని ప్రధాని పేర్కొన్నారు.

### తనపై అనర్హత వేటు వేసే అధికారం

## యూపిపిఎస్సీకి లేదు

### మాజీ ప్రొబేషనరీ అధికారి పూజా ఖేడ్కర్

**న్యూఢిల్లీ:** యూపీఎస్సీకి తనపై అనర్హత వేటు వేసే అధికారం లేదని ఐఏఎస్ మాజీ ప్రొబేషనరీ అధికారి పూజా ఖేడ్కర్ వాదించారు. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్‌కు మాత్రమే అఖిల భారత సర్వీసుల చట్టం కింద చర్యలు తీసుకునే వీలు ఉందని ఆమె తన వాదన వినిపించారు. అధికార దుర్వినియోగం, తప్పుడు ధ్రువీకరణ పత్రాల సమర్పణ వ్యవహారంలో ఆ మధ్య ఐఏఎస్ మాజీ ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్ పేరు విరీడియాలో చక్కర్లు కొట్టింది. ప్రస్తుతం ఆమె కేసు దిల్లీ హైకోర్టు పరిధిలో ఉంది. కోర్టు విచారణలో యూపీఎస్సీ చేసిన వాదనలను పూజ తోసిపుచ్చారు. తాను ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేదని తెలిపారు. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్‌పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ ఆమెను ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడవిరీకి తిరిగి రావాలని ఆదేశించింది. నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ దానిపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేయడంతో పాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. దీనిపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు. తనపై వచ్చిన ఆరోపణలపై సమాధానం ఇచ్చే వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని ఆమె కోర్టును అభ్యర్థించారు.

# ఫిర్యాదులపై ఆధారాల సేకరణ

- పరిశీలించి.. నిర్ధారించుకుంటున్న హైడ్రా
- తాజాగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కాలేజీలకు నోటీసులు

**ఖైరతాబాద్, ప్రజానావ:** ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి, నిర్ధారించుకుంటున్న హైడ్రా నోటీసులు ఇస్తోంది. నేరుగా కూల్చివేతలకు దిగుతోంది. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి హైడ్రా షాక్ ఇచ్చింది. మర్రి రాజశేఖర్ ఇంజినీరింగ్ కాలేజీలకు హైడ్రా నోటీసులు పంపింది. దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కాలేజీలను అక్రమంగా నిర్మించారంటూ హైడ్రా నోటీసులు పంపింది. వీటిని చిన్న దామెర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో కట్టారంటూ ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో అధికారులు నోటీసులు పంపించారు. దీనిపై 15రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. కాలేజీలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకో వాలని లేనిపక్షంలో తగిన చర్యలు తప్పవంటూ రాజశేఖర్ రెడ్డిని హైడ్రా హెచ్చరించింది. దామెర చెరువులో నిర్మించిన మర్రి రాజశేఖర్ రెడ్డి కాలేజీలను ఇటీవల హైడ్రా బృందం పరిశీలించింది. వాటిని అక్రమంగా నిర్మించారంటూ అధికారులు నిర్ధారణకు వచ్చారు. అయితే గతంలో చిన్నదామెర చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన కొన్ని భవనాలను మున్సిపల్ అధికారులు ఇప్పటికే కూల్చివేశారు. ఇటీవల మరో బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థలకు సైతం హైడ్రా నోటీసులు ఇచ్చింది. మేడ్చల్ జిల్లా నాడెం చెరువు బఫర్‌జోన్‌లో రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్టు అక్రమ నిర్మించారంటూ నీటిపారుదల శాఖ ఫిర్యాదు మేరకు హైడ్రా నోటీసులు జారీ చేసింది. దీనిపై పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ పంచాయతీ కొర్రెముల రెవెన్యూ పరిధిలోని 813 సర్వే నంబర్‌లో ఈ నిర్మాణాలు ఉన్నాయి. అయితే నాడెం చెరువుకు 30మీటర్ల బఫర్‌జోన్ వదిలిపెట్టి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా సదరు విద్యాసంస్థల యాజమాన్యం నిబంధనల్ని ఉల్లంఘించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే పల్లా మాత్రం అక్రమంగా కేసులు పెట్టారని, న్యాయపరంగా ముందుకు వెళ్తానని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేసిన హైకోర్టు నిబంధనల ప్రకారం హైడ్రా ముందుకు వెళ్లాలని సూచించింది. ఇదిలావుంటే రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసులపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కాలేజీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. వారం రోజుల వరకు కాలేజీలపై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. వారం రోజుల్లో తహసీల్దార్ నోటీసులకు వివరణ ఇవ్వాలని విద్యాసంస్థలను ఆదేశించింది. కాలేజీల వివరణ కూడా విని చట్టప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని తహసీల్దార్‌కు న్యాయస్థానం సూచించింది. చిన్నదామెర చెరువునకు చెందిన 8 ఎకరాల 24 గుంటల భూమి ఆక్రమణకు గురైందని.. సర్వే నెంబర్లు 489, 485, 458, 484, 492, 489 భూముల్లో భవనాలు, షెడ్స్, వాహనాల పార్కింగ్ నిర్మాణాలు చేపట్టారని.. రోడ్ల నిర్మాణం కూడా చేపట్టారంటూ రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. 7 రోజుల్లో కాలేజీల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని.. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఎంఎల్ఆర్ఐటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కాలేజీలకు ఇచ్చిన నోటీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదు. హైకోర్టులో దాఖలైన పిటిషన్ లో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరిలోని 13 చెరువుల ఆక్రమణలకు సంబంధించి వివరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలతోనే రెవెన్యూ అధికారులు ఈ నోటీసులు జారీ చేశారు.

# మేనిఫెస్టో హామీలకు కాంగ్రెస్ మంగళం

- కత్తిమీద సాములా పంటలు పండించడం.. విక్రయించడం
- రైతు వ్యతిరేక విధానాలు ఇప్పటికైనా వీడండి
- సీఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ



**హైదరాబాద్, ప్రజానావ:** మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు కాంగ్రెస్ నేతలు మంగళం పాడారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఎద్దేవా చేశారు. అదే తీరుగా ఇప్పుడు మద్దతు ధర ప్రకారం పంటలు కొనుగోలు చేసే బాధ్యతను విస్మరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో పంటలు పండించడం, పండించిన పంటలను విక్రయించుకోవడం రైతన్నకు కత్తిమీద సాముగా మారిందన్నారు. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచుతున్న తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి వ్యవసాయ, రైతు వ్యతిరేక విధానాలను వీడాలన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా పెసర కొనుగోలు కేంద్రాలు, జిల్లాల్లో తక్షణం ఏర్పాటు చేయాలన్నారు. రైతులు నష్టపోకుండా చూడాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు పేర్కొన్నారు. ఆహార పంటల బదులు పప్పుధాన్యాల సాగుతో మెరుగైన లాభాలు సాధించ వచ్చన్న రైతుల ఆశలు అడియాశలు చేసేలా మీ ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటా పెసరకు మద్దతు ధర రూ. 8,682 ప్రకటించినప్పటికీ ఆ ధరకు ఎవరూ కొనుగోలు చేయని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో వ్యవసాయ మార్కెట్లు, గ్రామీణ ప్రాంతాల వ్యాపారులకు పంటను క్వింటా రూ. 6,000 నుంచి రూ. 6,500 మధ్యనే రైతులు విక్రయిన్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రైవేటు వ్యాపారులు ఆడిందే ఆటగా మారటంతో రైతులు క్వింటాకు రూ. 2,500 పైగా నష్టపోతున్నారన్నారు. ఈ సంవత్సరం మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో మీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీష్ రావు తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం ప్రదర్శించడం పెసర పంట రైతులకు శాపంగా మారిందన్నారు. కష్టపడి పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించే పరిస్థితి లేదని ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, నారాయణ పేట, సూర్యాపేట తదితర జిల్లాల రైతులు తీవ్ర ఆవేదన, ఆందోళన చెందుతున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ఇప్పటికే రుణమాఫీ, రైతు బంధును అటకెక్కించిన మీ ప్రభుత్వం మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తామన్న మాటను బోగస్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఇస్లామిక్ టెర్రరిస్టుల హెచ్చరికల నేపథ్యం


**న్యూఢిల్లీ:** ఉగ్రవాదుల దుశ్చర్యలు, బెదరింపుల నేపథ్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ భద్రతను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మరింత పటిష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న జడ్ ప్లస్ కేటగిరి భద్రతను అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్‌కు పెంచింది. దీంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమానమైన భద్రత మోహన్ భగవత్‌కు లభిస్తుంది. భద్రతకు ముప్పు తలెత్తే అవకాశాలపై ఇంటెలిజెన్స్ బ్యూరో ఇచ్చిన తాజా నివేదక ప్రకారం మోహన్ భగవత్‌కు భద్రత పెంచాలని ఆగస్టు 16న తాజా ఆదేశాలు జారీ అయినట్టు అధికార వర్గాలు తెలిపాయి. గతంలో మోహన్ భగవత్ కొన్ని సెన్సిటివ్ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఏఎస్ఎల్ ప్రోటోకాల్ కల్పించేవారు. ఇటీవల కొన్ని చోట్ల, ముఖ్యంగా బీజేపీయేతర రాష్ట్రాల్లో భగవత్ భద్రతలో అలసత్వాన్ని ఇంటిలిజెన్స్ గమనించింది. రాడికల్ ఇస్లామిస్ట్ గ్రూపులతో సహా వివిధ సంస్థల నుంచి ఆయనకు ముప్పు పెరిగినట్టు అంచనా వేసింది. ఈ నేపథ్యంలో భగవత్‌కు ఏఎస్ఎస్ ప్రోటోకాల్ భద్రత కల్పించాలని హోం

# సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం

- ఏర్పాటుకు సంబంధించి భూమిపూజ
- డిసెంబర్ 9 నాటికి విగ్రహావిష్కరణ
- పూజలో పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రులు



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** తెలంగాణ సచివాలయంలో డిసెంబర్ 9 నాటికి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే స్థలపరిశీలన చేసిన చోట విగ్రహం ఏర్పాటుకు పూనుకుంది. ఈ మేరకు బుధవారం భూమి పూజ నిర్వహించింది. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రక్రియ చేపట్టారు. వేదమంత్రాలుగా సాక్షింగా 11 గంటలకు రేవంత్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికారులు పలుమార్లు చర్చించి సచివాలయంలో పోర్టికోకు ఎదురుగా విగ్రహం ఏర్పాటుకు నిర్ణయించారు. మెయిన్ గేట్ నుంచి భవనం లోపలకు వెళ్ళే క్రమంలో అందరికీ కనిపించేలా దాన్ని రూపొందిస్తున్నారు. అక్కడే ఇవాళ భూమి పూజ జరిగింది. దీన్ని శరవేగంగా డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలి ప్రభుత్వం సంకల్పించింది. 2009లో డిసెంబర్ 9న అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ ఇస్తున్నట్టు ప్రకటించారు. అందుకే ఆ తేదీన విగ్రహావిష్కరణ చేయాలని నిర్ణయించారు. జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ ఆర్టిస్టులు, తెలంగాణకు చెందిన కళాకారులు రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాలను పరిశీలించిన తర్వాత ఫైనల్ విగ్రహాన్ని ఖరారు చేయనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే ఉంటుందంటున్నారు. విగ్రహం తెలంగాణ సంస్కృతి చాటి చెప్పేలా ఉంటుందని చెబుతున్నారు. తెలంగాణ ప్రజల దయాగుణం, త్యాగనిరత, మహిళల రూపం అన్నీ కలిసేలా రూపొందించ నున్నారు. దసరా వరకు మంచిరోజులు లేవని వేదపండితులు చెప్పడంతోనే ఇప్పుడు హడావుడిగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఉండదని తెలంగాణ ఉద్యమకారులు నిరూపించారన్నారు. సోనియమ్మ మాట ఇస్తే అది శిలాశాసనమని తెలంగామ రాష్ట్ర ఏర్పాటు నిరూపిచిందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారని గుర్తు చేశారు. పదేళ్లు పరిపాలన చేసిన వారు తెలంగాణ తల్లిని తెరమరుగు చేశారని విమర్శించారు. నేనే తెలంగాణ.. తెలంగాణనే నేను అనే విధంగా గత పాలకులు వ్యవహరించారని ధ్వజమెత్తారు. ప్రజాప్రభుత్వం అలాంటి విధానాలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. సచివాలయం తెలంగాణకు, తెలంగాణ ప్రజలకు గుండెకాయలాంటిదని అందుకే అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. గత పాలకులు పదేళ్లు సచివాలయంలోకి ప్రజలకు ప్రవేశం కల్పించలేదని తెలిపారు. అదే కాకుండా సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు వారికి మనసు రాలేదని ఆరోపించారు. ట్యాంక్ బండ్ నలువైపులా ఎంతో మంది ప్రముఖుల విగ్రహాలు ఉన్నాయని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాజీవ్ గాంధీ విగ్రహం లేకపోవడం లోటుగా కనిపించిందని అభిప్రాయపడ్డారు. మేధావుల సూచన మేరకే సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీన్ని వివాదం చేసేందుకే తెలంగాణ తల్లి విగ్రహంతో ముడి పెట్టారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉండి వాళ్లు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభిస్తామని ఇప్పటికే రేవంత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విగ్రహం ఏర్పాటుకు ఇవాళ రేవంత్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు ఇవాళ శుభ దినమని పేర్కొన్నారు. పదేళ్ల నుంచి తెలంగాణ తల్లి తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. 2004 కరీంనగర్‌లో తమ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ మాట ఇచ్చారని.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిన తరువాత అనేక రకాలుగా వెనుక బడ్డారన్నారు. తెలంగాణ తల్లిని వెనక్కినెట్టి వారే సర్వం అన్నట్లు గత పాలకులు వ్యవహరించారన్నారు. ముళ్ళ కంచె ఏర్పాటు చేసుకొని రాజ భోగం అనుభవించారన్నారు. అది ఒకప్పుడు ఘడీల భవనమని.. ఇప్పుడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవనమని పేర్కొన్నారు. పదేళ్లు ముఖ్యమంత్రి , మంత్రులు ఎవరూ అందుబాటులో లేరని.. అసలు సచివాలయంలోకి సామాన్యులకు ఎంట్రీయే లేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వేల కోట్లు ఖర్చు చేసి సచివాలయం నిర్మించిన వాళ్లకు కోటి రూపాయలు పెట్టి తెలంగాణ తల్లి విగ్రహం పెట్టలేకపోయారని రేవంత్ విమర్శించారు. దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన రాజీవ్ గాంధీ విగ్రహం సచివాలయం ఎదురుగా పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. సచివాలయం ఎదురుగా ఖాళీ స్థలంలో కొంతమంది తమ కోసం ఆపారన్నారు. తెలంగాణ తల్లి అంటే దర్పం, పోరాట పటిమకు స్ఫూర్తి అని రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణ తల్లి దొరల కోటలో బందీ కావొద్దన్నారు.



# చెరువుల ఆక్రమణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- పాక్ష్యాంశంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం
- రుణమాఫీ అందరికీ వర్తింప చేయాల్సిందే
- కవితకు బెయిల్‌పై రాజకీయ విమర్శలు సరికాదు
- సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్

**హైదరాబాద్, ప్రజానావ:** హైదారాబాద్ జంట నగరాల పరిధిలో ఎన్ని చెరువులు కబ్జాకు గురయ్యాయో వాటి జాబితాను హైడ్రా విడుదల చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్య పుస్తకాలలో చేర్చాలని కూనంనేని కోరారు. ఆర్ఎస్ఎస్ కు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలకు సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అందరికీ రుణమాఫీ చేయాలన్నారు. మంత్రులు ఒక్కొక్కరు ఒక్కో మాట కాకుండా అందరూ కలిసి ఒకే మాట చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్‌తో పోల్చితే కాంగ్రెస్ వెయ్యి పాళ్ళు నయమని కూనంనేని ప్రశంసించారు. ఇదే సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో పట్టింపులు ఎందుకని కూనంనేని ప్రశ్నించారు. ఇచ్చినవి ఇచ్చామని.. ఇవ్వనివి లేదని చెప్పాలని పేర్కొన్నారు. రేషన్ కార్డుకు నిబంధన ఎందుకని ఆయన ప్రశ్నించారు. చిన్న ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారని.. వారికి రుణమాఫీ చేయరాఅని కూనంనేని నిలదీశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు అందరికీ రుణమాఫీ చేయాలన్నారు.సీఎం రేవంత్ రెడ్డి పులిమీద స్వారీ చేస్తున్నారని అన్నారు. చెరువుల ఆక్రమణలపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐపీఎస్ రంగనాథ్ మంచి మనిషి అని... పనిలో స్పీడ్ ఉందని కూనంనేని కొనియాడారు. చెరువులు, శికం భూమిలో పర్మిషన్ ఇచ్చిన అధికారులు, మంత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్‌ను రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కవిత ఒక ఆడపిల్ల అని.. ఆమె తప్పు చేసిందా ఒప్పు చేసిందా అనేది కోర్టులు నిర్ధారిస్తా యని పేర్కొన్నారు. ఆడపిల్ల మీద అంత కక్ష ఎందుకు అని కూనంనేని ప్రశ్నించారు. రాజకీయంగా ఏమైనా చేయాలనుకుంటే కేసీఆర్‌తో చూసుకోవాలని.. ఆమెపై రాజకీయం ఎందుకని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు అని కూనంనేని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 ను అధికారికంగా చేస్తే ముస్లింలు వ్యతిరేకించరని తెలిపారు. అలాగే చెరువుల పునరుద్ధరణ చేపట్టాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు అని స్పష్టం చేశారు. అది ముస్లిం, హిందువుల మధ్య జరిగిన ఘర్షణ కాదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్య పుస్తకాలలో చేర్చాలన్నారు.



# ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకలు

### 3వ నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు

**విజయవాడ, ప్రజానావ:** ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఈయేడు ఘనంగా నిర్వహించాలని పాలక మండలి నిర్ణయించింది. పది రోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే వేడుకల్లో అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాల ముహూర్తం ఖరారు చేశారు. మొదటి రోజైన అక్టోబర్ 3న అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. 4వ తేదీన గాయత్రీదేవిగా, 5వ తేదీన అన్నపూర్ణ దేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. 6వ తేదీన లలితా త్రిపుర సుందరీదేవిగా, 7వ తేదీన మహాచండీ అలంకారంలో, 8వ తేదీన మహాలక్ష్మి దేవి గా దర్శనమిస్తారు. 9వ తేదీన సరస్వతి దేవిగా దర్శనమిస్తారు. 10వ తేదీన దుర్గాదేవిగా, 11వ తేదీన మహిషాసురమర్దినిగా, 12వ తేదీన రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు దర్శన మిస్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దసరా ఉత్సవాల కోసం ఆలయంలో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో రామారావు తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరిగే దేవీ శరన్నవరాత్రులకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి రానున్నారు. సగటున ప్రతి రోజు లక్షమంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుంటారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలనక్షత్రం రోజు సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇస్తారు. అక్టోబర్ 9వ తేదీన సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఏడాది ఉత్సవాల నిర్వహణ కోసం ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. క్యూ లైన్ల ఏర్పాటుతో పాటు భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో 10 రోజుల పాటు ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తారు. గర్భగుడి దర్శనానికి అనుమతించరు. కేవలం ప్రోట్రోకాల్ కలిగిన వ్యక్తులకు మాత్రమే ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. సామాన్య భక్తులకు లిఫ్ట్ సౌకర్యం అందుబాటులో ఉండదు. కేవలం వృద్ధులు, ఆలయ సిబ్బందికి లిఫ్ట్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. కొండకింద నుంచి పైకి క్యూ లైన్‌లో వెళ్లాల్సి ఉంటుంది. బస్సు మార్గంలో కొండపైకి సగం వరకు చేరుకోవచ్చు.



# నాటు తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తి సహా ముగ్గురి అరెస్ట్

### నిందితులపై గతంలోనే గంభీరావుపేట పీఎస్‌లో కేసు

**సిరిసిల్ల, ప్రజానావ:** నాటు తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తితో పాటు మరో ముగ్గురిని అరెస్టును చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యా లయంలో బుధవారం వివరాలు వెల్లడించా రు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ అనే వ్యక్తి నాటు తుపాకులు తయారుచేసి వాటిని అదే గ్రామానికి చెందిన అడవి జంతువులను వేటాడే వారికి అమ-్మతున్నాడన్నా నమ్మదగిన సమాచారం రాగా గంభీరావుపేట ఎస్ఐ బుధవారం తన సిబ్బందిని తీసుకొని గజసిం గవరం గ్రామంలోని రాయలింగు శంకర్ ఇంటికి వెళ్లాడు. అక్కడ రాయలింగు శంకర్ వివిధ పనిముట్ల ఉపయోగించి నాటు తుపాకులు తయారు చేస్తుండగా పట్టుకొని, అతని వద్ద రెండు తుపాకీ బ్యారెల్, తుపాకుల తయారు చేయడానికి వాడే రంప ము, సుత్తి, కత్తి, ఆకు రాయి, డ్రిల్లింగ్ మిషన్ ,దూడ మిషన్, ఎయిర్ బుల్లోజర్ స్వాధీనం చేసుకొని నిందుతున్నీ పై కేసు నమోదు చేస్తున్నామన్నారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కేసు తదుపరి దర్యాప్తు ప్రారంభించగా దర్యాప్తులో భాగంగా గజసిం గవారం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ వద్ద నాటు తుపాకులు కొనుగోలు చేసి జంతువుల వేటకు ఉపయోగిస్తున్న రాయలింగు చంద్రమౌళి, శాతవేణిహరీష్ లోగిడి గంగయ్యలను అదుపులోకి తీసు కొని వారి వద్ద రెండు తుపాకులు నాలుగు ట్రిగర్ భాగాలు స్వాధీనం చేసుకొవడం జరిగిందని పై నలుగురు నిందుతులను ఈ రోజు రిమాండ్ కి తరలించడం జరిగిందని తెలిపారు.

ఇదిలాఉంటే చాకచక్యంగా వ్యవ హరించి నిందితులను అరెస్ట్ చేసిన ఎల్లారె డ్డిపేట్ సీఐ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ రామ్మోహన్ ,సిబ్బంది అభినందించిన జిల్లా ఎస్పీ గారు. సమావేశంలో డిఎస్పీ చంద్రశేఖ ర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ ఐ లు రామ్మో హన్,రమాకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

## మేధో దివ్యాంగ విద్యార్థులకు
# టీఎల్ఎం కిట్ల పంపిణీ



**సిరిసిల్ల, ప్రజానావ:** మండల విద్యా వనరుల కేంద్రం సిరిసిల్లలో ఉన్న భవిత కేంద్రం, కేంద్ర ప్రభుత్వ జాతీయ మేధో దివ్యాంగ వ్యక్తుల సాధికారిత సంస్థ (ఎన్ఐఈపీఐడీ), సికింద్రాబాద్ ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లాలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న మేధో దివ్యాంగ విద్యార్థుల బాల బాలికలకు మొత్తం ఆరుగురికి టీచింగ్ లెర్నింగ్ మెటిరియల్ కిట్లు (టీఎల్ఎం) జిల్లా విద్యాధికారి ఏ. రమేశ్ కుమార్ చేత పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల మేధో అభివృద్ధి, అకాడమిక్ అంశాల వృద్ధికి టీఎల్ఎం కిట్లు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు టీఎల్ఎం కిట్లు వినియోగించుకునేలా చేసి వారి సామర్థ్యాల పెంపుదలకు ఉపాధ్యాయులు దోహదం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఈపీఐడీ సంస్థ కోర్డినేటర్ ఎస్.లకన్ బాబు, జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ పీ.సతీశ్ కుమార్, మండల విద్యాధికారి డీ.రఘుపతి, సహిత విద్య ఉపాధ్యాయులు, దివ్యాంగులు, వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో నిందితుడికి రిమాండ్

### 100 గ్రాముల గంజాయి స్వాధీనం



**సిరిసిల్ల, ప్రజానావ:** గంజాయి కేసులో నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మొగిలి తెలిపారు. బుధవారం సిరిసిల్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. వేములవాడ మండలం జయ్యారం గ్రామనికి చెందిన డప్పుల వంశీ ఇంటర్ చదివే సమయంలో గంజాయికు అలవాటు పడ్డాడు. హైదరాబాద్‌లో సినిమాటోగ్రఫీ కోర్సు చేసే సమయంలో జల్సాలకు అలవాటు పడి అక్కడి నుంచి వేములవాడకు వచ్చి ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. అతనికి తెలిసిన వ్యక్తుల వద్ద గంజాయిని కొని అందులో కొంత తాను తాగి, డబ్బుల సంపాదించాలనే ఉద్దేశ్యంతో మిగిలిన దానిని అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకునే వాడు. ఈ క్రమంలో ముస్తాబాద్‌లో గంజాయికి అలవాటు పడిన వారికి అమ్మేందుకు వెళ్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు ముస్తాబద్ ఎస్ఐ సిబ్బందితో వెళ్లగా ముస్తాబద్ శివారులో ఏఎంఆర్ ఫంక్షన్ హాల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి, ఒక యాక్టివా స్కూటీ, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.

WANTED
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్ /
జిల్లా ఇంచార్జీలు కావలెను



కరీంనగర్, జగిత్యాల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట, జోగులాంబ గద్వాల

అనతికాలంలో తెలుగు రాష్ట్రాల్లో సంచలన కథనాలు అందిస్తూ విశేష ప్రజాదరణ పొందిన 'ప్రజానావ' తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు అన్ని జిల్లాల నుంచి స్టాఫ్ రిపోర్టర్/జిల్లా ఇన్‌చార్జీలను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
8185093931, 96766 67020, 72888 25681

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం

త్వరలో 'ప్రజానావ' సంస్థ ఆధ్వర్యంలో జర్నలిజం యందు శిక్షణ తరగతులు నిర్వహించబడును.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

విలేకరులు కావలెను

రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న ప్రజానావ తెలుగు దినపత్రికలో పని చేయుటకు జర్నలిస్టులకు ఆహ్వానం.. జర్నలిస్టుగా రాణించాలనే తపన.. వార్తా సేకరణలో నేర్పరితనం ఉన్న వారికి సదావకాశం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో
ఈ కింది మండలాలకు విలేకరులు కావలెను

1. సిరిసిల్ల ఆర్‌సి ఇన్‌చార్జి
2. సిరిసిల్ల టౌన్/రూరల్
3. వేములవాడ ఆర్‌సి ఇన్‌చార్జి
4. వేములవాడ టౌన్
5. వేములవాడ రూరల్
6. తంగళపల్లి
7. ఎల్లారెడ్డిపేట
8. ముస్తాబాద్
9. వీర్నపల్లి
10. గంభీరావుపేట
11. ఇల్లంతకుంట
12. కోనరావుపేట
13. రుద్రంగి
14. బోయినపల్లి

9676667020, 8688523585



# రీజినల్ రింగ్ రోడ్డుపై సీఎం సమీక్ష

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** జూబ్లీహిల్స్ నివాసంలో రీజినల్ రింగ్ రోడ్ (దక్షిణ భాగం) అలైన్‌మెంట్ పై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. త్వరగా భూసేకరణ చేయడంతో పాటు, సర్వీస్ రోడ్ల నిర్మాణం తదితర అంశాలను సిఎం చర్చించారు. దీనిని ప్రతిష్టాత్మకంగా సిఎం భావిస్తున్నారు. త్వరగా భూసేకరణ ద్వారా నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.



# త్వరలోనే రాజన్నఆలయ అభివృద్ధికి పునాదులు

- రాష్ట్రంలో అత్యధికంగా భక్తులు వచ్చే ఆలయం వేములవాడ రాజన్న ఆలయమే
- కార్తీక మాసంలోపు టీటీడీ తరహా నిత్యాన్నదానం
- కోడెల రక్షణకు ప్రత్యేక చర్యలు
- బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**వేములవాడ, ప్రజానావ:** వేద పండితులు, శృంగేరి పీఠాధిపతుల అనుమతితో త్వరలోనే ఆలయ అభివృద్ధికి పునాదులు వేస్తామని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 'నేను రాజన్న భక్తుడినే. తెలంగాణలో అత్యధికంగా భక్తులు వచ్చే ఆలయం వేములవాడ రాజన్న ఆలయమే.. రాబోయే కార్తీక మాసంలో తిరుమల తిరుపతి తరహాలో నిత్యాన్నదానం చేయాలని ఆలోచన చేస్తున్నాం' అని చెప్పారు. రాజన్న చెంతకు వచ్చే భక్తులకు శాశ్వత అన్నదానం ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. బుధవారం ఆయన ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్‌తో కలిసి వేములవాడలో పర్యటించారు. ముందుగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేములవాడ ప్రాథమిక సహకార సంఘం గోదాంతో పాటు, మండల పరిషత్ కార్యాలయ సముదాయ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన కేడీసీసీ బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. కోడెల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాల కోసం వసతి గదుల నిర్మాణం చేస్తామన్నారు. అనంతరం కేడీసీసీ బ్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ జిల్లా ప్రజల గౌరవాన్ని కాపాడే విధంగా నా వ్యక్తిగత గౌరవాన్ని పెంపొందించుకుని విధంగా ఈ బ్యాంక్ ప్రారంభించుకున్నామని మంత్రి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేశామని, ఎవరికైనా రైతు రుణమాఫీ కాకపోతే సహకార వ్యవస్థ ద్వారా ప్రభుత్వంతో సమన్వయం చేసి రుణమాఫీ ఇప్పిస్తుందన్నారు. కరీంనగర్ జిల్లా నుంచి 59వేల మంది రైతులకు రూ.444 కోట్లు రుణమాఫీ అయిందన్నారు. 2005 లో కేంద్రంలో



మన్మోహన్ సింగ్ రాష్ట్రంలో వైఎస్ఆర్ లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేశారని, ఇప్పుడు దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి దశలో లక్ష, రెండో దశ లక్ష 50 వేలు, మూడో దశలో రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేశామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు రాజకీయాలకు తావు లేకుండా సహకార సంఘంలో రైతుల హితం కోసమే మనం పని చేయాలని పిలుపునిచ్చారు. తాను మార్క్ ఫెడ్ చైర్మన్‌గా ఉన్నప్పుడు వడ్ల , మొక్క జొన్న కొనుగోలును మహిళా సంఘాల ద్వారా, సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేశామన్నారు. ఇప్పుడు మంత్రి అయిన తొలిరోజే తెలంగాణలో మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందిస్తున్నామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.10 లక్షల ఆరోగ్య శ్రీ చేశామని తెలిపారు. వచ్చే నెల 17వ తేదీ నుంచి ప్రజా పాలన ప్రారంభం అవుతుందని, అందరికీ ఆరోగ్య శ్రీ కార్డు లు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో పాటు, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకుంటా

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రకటన
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటన




**వరంగల్, ప్రజానావ:** గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. తొలుత ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పర్యటించారు. రామప్ప, కోట గుళ్లను సందర్శించారు. లక్నవరం సరస్సును సందర్శించి, బోటు షికారులో తిరిగారు. అంతకుముందు మంత్రులు సీతక్క, పొంగులేటి నాయకులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ ప్రసంగించారు. గవర్నర్ రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు చేశారు. ఇకపోతే ములుగు జిల్లాలో ఒక గ్రామాన్ని త్వరలోనే దత్తత తీసు కుంటానని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా గోవిందరావుపేట మండలం బుస్సాపురం గ్రామంలోని పర్యాటక ప్రాంతమైన లక్నవరానికి చేరుకొని ఆయన బస చేశారు. బుధవారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అనంతరం మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి సరస్సులో గవర్నర్ స్పీడ్ బోటు షికారు చేస్తూ లక్నవరం అందాలను తలకించారు. తాను ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని గవర్నర్ వెల్లడించారు. అనంతరం సీతక్క మాట్లా డుతూ జిల్లాలో ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటామని గవర్నర్ హామీ ఇవ్వడం చాలా అభినందనీయమని అన్నారు. గవర్నర్ పర్యటనకు సహకరించిన కలెక్టర్, పోలీసులు, ప్రజలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తిరుగు ప్రయాణంలో గవర్నర్ ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాను సందర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా విషపురుగు కాటుకు గురైన కానిస్టేబుల్‌ను పరా మర్శించారు. గవర్నర్ వెంట టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి, ఎస్పీ డాక్టర్ పి. శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి ఉన్నారు.

# జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలి

**రవాణా శాఖ మంత్రికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వినతి**



**సిరిసిల్ల, ప్రజానావ:** రాష్ట్రంలోని అక్రిడిటేడ్ జర్నలిస్టులందరికీ ఎలాంటి టికెట్ రాయితీ లేకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాజన్న సిరిసిల్ల జిల్లా యూనియన్ పక్షాన బుధవారం వినతి పత్రం సమర్పించారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అంతకుముందు వేములవాడ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌ను మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాసులు సందర్శించారు. జర్నలిస్టులు వారికి ఆత్మీయ సన్మానం చేసి సత్కరించారు. ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులను మంజూరు చేయాలని క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, కార్యదర్శి మహేశ్ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దాసరి దేవేందర్, వేములవాడ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షులు ప్రశాంత్, సంయుక్త కార్యదర్శి సంపత్, కోశాధికారి నరేశ్, సభ్యులు ఉల్లందులో మల్లేశం, గుడిసె కిషన్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కల్చరర్ కార్యదర్శి హరి తదితరులున్నారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట

## హైడ్రా నోటీసులపై వారం పాటు స్టే

**ఖైరతాబాద్, ప్రజానావ:** విద్యాసంస్థల కూల్చివేత విషయంలో బిఆర్ఎస్ ఎంఎల్ఎలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిలకు భారీ ఊరట లభించింది. పల్లా రాజేశ్వర్ రెడ్డి చెరువులను కబ్జా చేసి విద్యాసంస్థలు నిర్మించారని ఫిర్యాదులు రావడంతో హైడ్రా నోటీసులు జారీ చేసింది. దీంతో పల్లా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన కోర్టు, తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. అంతేగాక శుక్ర వారం విచారణ ముగిసే వరకు అనురాగ్, నీలిమ విద్యాసంస్థలను కూల్చవద్దని హైడ్రాకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే కొర్రెముల, నల్లచెరువు రికార్డులు సమర్పించాలని ప్రభుత్వానికి చెప్పింది. బిఆర్ఎస్ ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘట్‌కేసర్ మండలం వెంటాపూర్ పరిధిలోని నాదం చెరు వు బఫర్ జోన్లో ఉన్న భూమిని ఆక్రమించి అను రాగ్, నీలిమా విద్యాసంస్థలు నిర్మాణాలు జరిపా రని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విద్యా సంస్థలపై హైడ్రా నుంచి పల్లా రాజేశ్వర్ రెడ్డికి నోటీసులు అందాయి. దీనిపై తమ విద్యా సంస్థలు అన్ని అనుమతులతోనే నిర్మించామని, ఆక్రమణల పేరుతో అధికారులు తమ ఆస్తుల్లో జోక్యం చేసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని పల్లా హైకోర్టును ఆశ్రయించారు. ఇకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి చెందిన ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కాలేజీలకు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. చిన్న దామెర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ లో నిర్మాణాలపై ఏడు రోజుల వరకు స్టే విధించింది. సంబంధిత డాక్యుమెంట్లతో ఏడు రోజుల్లోగా తహసీల్దార్‌ను కలసి వివరణ ఇవ్వాలని ఆదేశించింది కోర్టు. వివరణ తర్వాత చట్టప్రకారం ముందుకు వెళ్లాలని తహసీల్దార్‌ను ఆదేశించింది. ఈ ఏడు రోజుల వరకు తహసీల్దార్ కూల్చివేత సహా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని చెప్పింది. భూమిని సర్వే చేయకుండా గండిమైసమ్మ తహసీల్దార్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని వాదనలు వినిపించారు మర్రి రాజశేఖర్ రెడ్డి తరపు న్యాయవాదులు. అయితే విద్యార్థుల అకాడమిక్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థల భవనాలు, నిర్మాణాలను కూల్చివేయడం లేదని, చర్యలు తీసుకుంటామని హైడ్రా చేసిన ప్రకటననూ న్యాయస్థానం దృష్టికి తెచ్చారు న్యాయవాదులు. హైదరాబాద్ సిటీ శివార్లలోని దుండిగల్ లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి చెందిన ఇంజినీరింగ్ కాలేజీలకు నోటీసులు ఇచ్చారు రెవెన్యూ అధికారులు. 2024, ఆగస్ట్ 28వ తేదీ ఈ మేరకు సమాచారం ఇచ్చారు అధికారులు. దుండిగల్ పరిధిలో ఉన్న చిన్నదామెర చెరువు, బఫర్ జోన్ పరిధిలో ఎంఎల్ఆర్ఐటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కాలేజీల నిర్మాణం జరిగిందని.. దీనికి సంబంధించి మీ వివరణ ఏంటీ అంటూ నోటీసుల ద్వారా అధికారులు ప్రశ్నించారు. చిన్నదామెర చెరువునకు చెందిన 8 ఎకరాల 24 గుంటల భూమి ఆక్రమణకు గురైందని.. సర్వే నెంబర్లు 489, 485, 458, 484, 492, 489 భూముల్లో భవనాలు, షెడ్స్, వాహనాల పార్కింగ్ నిర్మాణాలు చేపట్టారని.. రోడ్ల నిర్మాణం కూడా చేపట్టారంటూ నోటీసులు ఇచ్చారు రెవెన్యూ అధికారులు. 7 రోజుల్లో కాలేజీల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాల ని.. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటా మంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు అధికారులు.

# నేటి నుంచి జాతీయ ఉద్యాన ప్రదర్శన

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణ రాష్ట్రం 16వ జాతీయ వ్యవసాయ ఉద్యాన ప్రదర్శనకు సిద్ధమైంది. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా గురువారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ ఉద్యాన శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేయనున్నారు. సెప్టెంబర్ 2వరకూ మొత్తం ఐదు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనకు దేశం నలుమూలల నుంచి వచ్చిన నర్సరీల నిర్వహాకులు , సేంద్రీయ ఎరువులు , ఇతర పరికరాల సంస్థల ప్రతినిధులు, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీల ప్రతినిధులు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు.వందలాది రకాల పండ్ల మొక్కలు, పూల మొక్కలు, ఔషధ మొక్కలు, అలంకరణ మొక్కలు, మరగుజ్జు వృక్షాలు, తీగ జాతి మొక్కలు, వాటికి సంబంధించిన విత్తనాలు, దుంప మొక్కలు ఈ ప్రదర్శనలో కొలువుదీరుతున్నాయి. చూపరులను కట్టిపడేసేలా ఉన్న వివిధ రకాల అరుదైన జాతులకు చెందిన మొక్కలు ఈ సారి ప్రదర్శనకు హైలెట్‌గా మారనున్నాయని ప్రదర్శన నిర్వాహకులు ఖలీద్ ఆహ్మద్ జమీర్ వెల్లడించారు. ఈ ప్రదర్శనలో మొత్తం 140కి పైగా స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. ప్రతిరోజు ఉదయం తొమ్మది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ ప్రదర్శన ఉండనుంది.

# రాంనగర్ నాలా ఆక్రమణలు పరిశీలించిన రంగనాథ్

**హైదరాబాద్, ప్రజానావ:** ముషీరాబాద్ నియోజకవర్గంలో బుధవారం సాయంత్రం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆకస్మికంగా పర్యటించారు. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ గల్లీలో నాలాపై అక్రమ నిర్మాణాలు చేపట్టారని స్థానికుల ఫిర్యాదుమేరకు అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ పరిశీలించారు. మణెమ్మ గల్లీలో రోడ్డు ఇరుకుగా మారిందని, నాలా.. రోడ్డును ఆక్రమించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇళ్లలోకి వరదనీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు మొరపెట్టుకున్నారు. నాలా ఆక్రమణ, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి వివరాలు, సబంధిత స్థల పత్రాలను పరిశీలించాలని జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

# ఆర్జీకర్ మెడికల్ కాలేజ్ హత్యాచార ఘటన

## మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ సస్పెన్షన్

**కోల్‌కతా :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ట్రైనీ డాక్టర్ అత్యాచారం,హత్య కేసులో ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సస్పెండ్ చేసింది. డాక్టర్ ఘోష్ తన ప్రవర్తన వల్ల డాక్టర్ వృత్తికి చెడ్డపేరు తెచ్చారని క్రమశిక్షణా కమిటీ అతన్ని జాతీయ వైద్య సంఘం సభ్యత్వం నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని నిర్ణయించిందని ఐఎంఏ తెలపింది. అంతేగాకుండా బాధితురాలి తల్లిదండ్రులకు మనోవేదన గురయ్యేలా చేశారని వెల్లడించింది. ఈ కేసులో డాక్టర్ సందీప్ ఘోష్ ను సీబీఐ ఇప్పటికే విచారించింది. ట్రైనీ డాక్టర్ హత్యను డాక్టర్ సందీప్ ఘోష్ ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వైద్యురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు బాధితురాలి తల్లిదండ్రులకు చెప్పాడు.

# హిందీపరిశ్రమలో టాలెంట్‌కు స్థానం లేదు

## అలాంటి వారిని తీసి పక్కన పెడతారు నటి కంగనా రనౌత్ సంచలన వ్యాఖ్యలు



హిందీ చిత్ర పరిశ్రమలో టాలెంట్‌ను ఎంకరేజ్ చేయరని అంటూ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. టాలెంట్ ఉన్నవారికి ఇక్కడ ఎలాంటి గుర్తింపు లభించదని ఆరోపించారు. ప్రోత్సహించే వారు కూడా ఉండరన్నారు. నా దృష్టిలో బాలీవుడ్ ఒక నిస్సహాయ ప్రదేశం. ఈ పరిశ్రమకు చెందిన కొంతమంది ప్రముఖ వ్యక్తులు మనకు ఎలాంటి సాయం చేయరు. టాలెంట్‌ని చూసి వారు అసూయ పడతారు. ఎవరైనా టాలెంట్ ఉన్న వ్యక్తులు తమ దృష్టిలో పడితే తప్పకుండా వారి కెరీర్ నాశనం చేయడానికి చూస్తారు. పీఆర్‌లను నియమించి వారిపై దారుణంగా అవాస్తవాలు ప్రచారం చేయిస్తారు. ఇండస్టీ వారిని బహిష్కరించేలా పరిస్థితులు సృష్టిస్తారు‘ అని కంగనా రనౌత్ ఆరోపించారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. తాను అదే విధమైన పరిస్థితులు ఎదుర్కొన్నానని చెప్పారు. తనను బహిష్కరించారని పేర్కొన్నారు. ‘నా వరకూ నేను మంచి వ్యక్తిని. నా చుట్టూ ఉన్న వారితో మర్యాద పూర్వకంగా నడుచుకుంటా. ఎన్నికల్లోనూ విజయం సాధించా. ఇండస్టీ నుంచి ఎంతో ప్రేమాభిమానం పొందా. దీనిని బట్టి చూస్తే నాతో కొంతమందికి మాత్రమే సమస్య ఉంది. ఆ సమస్య నాలో ఉందా? లేదా వారిలో ఉందా? అనేది వారు కూడా ఒక్కసారి ఆలోచిస్తే మంచిది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రాజకీయ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎమర్జెన్సీ' ఆమె స్వీయ దర్శకత్వంలో తెరకెక్కింది. సెప్టెంబర్ 6న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారు. తన కెరీర్, బాలీవుడ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో తనపై కుట్ర జరిగిందని చెప్పారు. తన సినిమాల్లో యాక్ట్ చేయొద్దని చాలా మందికి చెప్పారని ఆరోపించారు.

# ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్

## ప్రభాస్‌పై విక్రమ్ ప్రశంసల వర్షం



ప్రపంచస్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్న స్టార్ హీరో ప్రభాస్ ప్రస్తుతం వరుస విజయాలను అందుకుంటూ రికార్డులు సొంతం చేసుకుంటున్నారు. తాజాగా ప్రభాస్ గురించి కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.'ప్రభాస్ ఇప్పుడు ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్. అతడిని తెలుగు హీరో అనడం సరికాదు' అని విక్రమ్ అన్నారు. మాళవిక మాట్లాడుతూ.. ప్రభాస్‌తో కలిసి నటించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. భాషపరంగా సినిమా సరిహద్దులను తొలగించారని ప్రశంసించారు. ఆయన నటించిన సినిమాలపై ప్రేక్షకులు చూపే అభిమానం చూస్తే ఆశ్చర్యమేస్తుందని చెప్పారు. ఈ ఏడాది 'కల్కి 2898 ఏడీ'తో భారీ విజయాన్ని అందుకున్న ప్రభాస్.. ప్రస్తుతం వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'రాజాసాబ్'. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీని షూటింగ్ అప్‌డేట్‌పై నిర్మాత క్లారిటీ ఇచ్చారు. 'ప్రభాస్ పాత్ర చిత్రీకరణ పూర్తయింది. సినిమా షూటింగ్ కూడా కంప్లీటైంది' అని ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు నిర్మాత శ్రీనివాస కుమార్ (ఎస్‌కెఎన్) రిప్లై ఇచ్చారు. 'ప్రభాస్ పాత్ర పూర్తయితే సినిమా షూటింగ్ అంతా కంప్లీట్ అయినట్లు కాదు కదా!' అని పేర్కొన్నారు. ప్రస్తుతం దీని చిత్రీకరణ శరవేగంగా జరుగుతోందన్నారు. రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో సిద్ధమవుతోన్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవిక మోహనన్‌తో పాటు నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా కనిపించనున్నారు.



# స్పెషల్ సాంగ్‌లో శ్రియా శరణ్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ స్టార్ కాంపౌండ్ నుంచి ఇప్పటికే కంగువ విడుదలకు ముస్తాబు తోంది. ఈ సినిమా విడుదల కాకముందే సూర్య 44 కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు సూర్య. స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. తొలి షెడ్యూ ల్‌లో భాగంగా అండమాన్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తోపాటు సూర్య, పూజాహెగ్డేపై వచ్చే సాంగ్స్‌ను చిత్రీకరించి నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. తాజాగా మరో ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో సీనియర్ హీరోయిన్ శ్రియా శరణ్ స్పెషల్ సాంగ్‌లో మెరువనుంది. ఊటీ షెడ్యూల్‌లో ఈ పాటను చిత్రీకరించనున్నారట మేకర్స్. ప్రస్తుతం సినిమా షూటింగ్ ఇడుక్కి పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్నట్టు సమాచారం. ఈ చిత్రంలో పాపులర్ మలయాళ నటుడు జోజు జార్జ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీకి సంతోష్ నారాయణన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పీరియాడిక్ వార్ అండ్ లవ్ నేపథ్యంలో వస్తోన్న సూర్య 44కు తిరు, 24, పేటా ఫేం సినిమాటోగ్రఫర్ డీవోపీగా పనిచేస్తున్నాడు. సూర్య హోంబ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పై తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని మేకర్స్ 2025 పొంగళ్ కానుకగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

# చీరకట్టులో ముద్దుగుమ్మ



రీతు వర్మ తెలుగు, తమిళ చిత్రాల్లో ఎక్కువగా కథానాయకిగా కనిపించే ఓ భారతీయ నటి. లఘు చిత్రాలు, సహాయ పాత్రలలో కనిపించి పేరుతెచ్చుకున్న ఈ బ్యూటీ తొలిసారి 2016లో హీరోయిన్‌గా చలనచిత్ర అరంగేట్రం చేసింది. తొలి చిత్రంతోనే ఉత్తమ నటిగా నంది అవార్డును, ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్ అవార్డును అందుకుంది. తాజాగా ఈ కోమలి షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 10 మార్చి 1990న తెలంగాణలోని హైదరాబాద్ లో జన్మించింది అందాల తార రీతూ వర్మ. ఈమె తండ్రి మధ్యప్రదేశ్‌కు చెందినవారు. హైదరాబాద్‌లోని విల్లా మేరీ కాలేజ్ ఫర్ ఉమెన్ లో తన ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసింది ఈ వయ్యారి భామ. తర్వాత హైదరాబాద్‌లో మల్లా రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ పట్టా పొందింది ఈ ముద్దుగుమ్మ. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత మిస్ హైదరాబాద్ బ్యూటీ పోటీలో పాల్గొని ఫస్ట్ రన్నరప్‌గా నిలిచింది ఈ బ్యూటీ. 2013లో ఎన్టీఆర్ బాద్‌షా చిత్రంలో కాజల్ చెల్లెలి పాత్రలో తొలిసారిగా వెండితెరపై కనిపించింది ఈ వయ్యారి. తర్వాత ప్రేమ ఇష్క్ కాదల్, నా రాకుమారుడు, నాని ఎవడే సుబ్రహ్మణ్యం వంటి చిత్రాల్లో నటించింది ఈ అందాల భామ. 2016లో విజయ్ దేవరకొండకి జోడిగా పెళ్లి చూపులు చిత్రంలో కథానాయకిగా ఆకట్టుకుంది. ఈ చిత్రానికి రెండు ఉత్తమ నటి అవార్డ్స్ పొందింది. తర్వాత కేశవ, నిన్నిలా నిన్నిలా, టక్ జగదీష్, వరుడు కావలెను, ఓకే ఒక జీవితం వంటి చిత్రాల్లో కథానాయకిగా ఆకట్టుకుంది ఈ వయ్యారి. వేలైల్లా పట్టధారి 2, కన్నుమ్ కన్నుమ్ కొల్లైయాడి, పుతమ్ పుదు కాళై, కణం,నితమ్ ఒరు వానం, మార్క్ ఆంటోనీ వంటి తమిళ చిత్రాల్లో కూడా కనిపించింది. ప్రస్తుతం తెలుగులో స్వాగ్ లో నటిస్తుంది. అలాగే ధృవ నచ్చతిరం: చాప్టర్ 1 – యుద్ధ కాండమ్ అనే తమిళ విడుదలకు సిద్ధంగా ఉంది.



# ఆయిల్ పామ్‌కు అనుకూల వాతావరణం

● సాగు చేసే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహం ● రైతుల్లో క్రమంగా పెరుగుతోన్న ఆసక్తి

**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్రంలో ఆయిల్ పాం సాగుకు అనుకూల వాతావరణం ఉందని, దీంతో జిల్లాలో రైతులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారు. పంట పెట్టుబడులను తగ్గించే ప్రయత్నంలో భాగంగా అనేక జిల్లాల్లో ఆయిల్ పామ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందచేస్తున్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దీనిని కొనసాగిస్తోంది. ప్రత్యేకించి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కూడా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు పదేపదే ఇదే విషయం చెప్పి వారిని ఆయిల్ పామ్ సాగువైపు మళ్లేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున సాగు చేసేందుకు ముందు కొచ్చారు. దీనికి సంబంధించి హార్టికల్చర్ శాఖ ఒక నివేదిక రూపొందించింది. ఖమ్మం, సిద్దిపేట, నిజామాబాద్ తదితర జిల్లాల్లో ఇప్పటికే సాగు చేపట్టారు. వాతారణంతో పాటు,నీటి లభ్యత కూడా ఎక్కువగా ఉందని అధికారులు అంచనాకు వచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పంట సాగు చేసేందుకు అనుకూలంగా ఉంది. నూనె గింజల ఉత్పత్తికి ఉష్ణోగ్రతలు,సాగుకు అనుగుణంగా దిగుబడి ఇచ్చే నేలలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఫలితంగా రైతాంగం ఆయిల్ పాం సాగుకు ఆసక్తి చూపుతు న్నారు. ఎకరా వరి సాగయ్యే నీటితో మూడెకరాల పామాయిల్ పంట సాగవుతుందని, అంతర పంటలతో అధిక లాభాలు వస్తాయని చెబుతున్నారు. ఆయిల్ పాం సాగుపై మొదటి నుంచీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు వర్షాలు కురిసి నీరు సమృద్ధిగా ఉంటే వరి పండిస్తున్నారు. ఆయిల్ పాం ప్రత్యామ్నాయ పంట కానుంది. రాబోయే రెండేండ్లలో తెలంగాణ వ్యాప్తంగా 42,250 ఎకరాల్లో సాగుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కుంది. ఇప్పటికే 2,500 ఎకరాల్లో తెలంగాణ ఉద్యానవన శాఖ ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. మొత్తం 246 మండలాలు అనుకూలంగా ఉన్నట్లు సర్వేలో తేలింది. ఈ సాగు వల్ల రైతులను పంట మార్పిడి వైపు ప్రోత్సహించినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.అందుకే దీనివైపు రైతులు మొగ్గు చూపేలా చేస్తోంది. ఖమ్మం,నిజామబాద్ లాంటి జిల్లాలు ప్రయోగాలకు ప్రసిద్ధం. ఇప్పటికైతే ఇక్కడ అడుగు పడలేదు. అయితే ఏదైనా పంటప్రయోగం జరగగాలంటే ఇక్కడి రైతులు ముందుకు వస్తారు. వ్యవసాయశాఖ ఈ మేరకు ఆయా జిల్లాల్లో అనుకూలంగా ఉన్న పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ప్రోత్సాహం అందించడంతో పాటు సబ్సిడీ కూడా అందుతున్న కారణంగా ఆయిల్ పామ్ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయిల్ పామ్ సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. మొక్కదశ నుంచి మార్కెటింగ్ వరకు అన్ని రకాలుగా సాయం చేయనుంది. రైతులకు మొక్కను రూ.25లకే అందిస్తారు. మొక్కలను కూడా ఉపాధిహామీ పథకం కింద అధికారులు నాటించనున్నారు. మొక్కలను పెంచడానికి ఈ ప్రాంతంలోనే అధికారులు నర్సరీని కూడా ఏర్పాటు చేయనున్నారు. సబ్సిడీపై వారికి డ్రిప్ పరికరాలు ఇవ్వనున్నారు. మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు జైపూర్ వద్ద ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నారు. దీంతో రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కోసం తిప్పలు కూడా తప్పనున్నాయి. ఇక సాగు విషయానికి వస్తే ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని, నామమాత్రపు ఎరువులు వాడితే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

# గిడుగు రామ్మూర్తి జయంతి

## తెలుగు భాషా దినోత్సవం



**విజయనగరం, ప్రజానావ:** తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడైన గిడుగు వెంకట రామమూర్తి తెలుగు కోసం ఎంతగానో కృషి చేశారు. ఆయన ఉద్యమ ఫలితంగా వాడుక భాషకు మర్యాద దక్కింది. గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, తెలుగులో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడైనారు. గిడుగు రామ్మూర్తి జనవరి 22, 1940న మరణించారు. గిడుగు రామ్మూర్తి జయంతి ఆగస్టు 29 ని 'తెలుగు భాషా దినోత్సవం' గా జరుపుకుం టున్నాము. ఆగష్టు 29, 1863న శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలో జన్మించారు. తండ్రి వీర్రాజు పర్వతాలపేట ఠాణాలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తుండేవారు. చిన్న వయస్సులోనే రామమూర్తి తండ్రిని కోల్పోయారు. విజయనగరంలో మేనమామగారి ఇంట్లో ఉంటూ రామమూర్తి చదువు కొనసాగించారు. 1879లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడ య్యారు. ఆ రోజుల్లో గురజాడ అప్పారావుకు సహాధ్యాయి.. ఆరోజుల్లోనే అతనికి దగ్గర అడ వుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగింది. తెలుగు, సవరభాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకు న్నారు. సవరభాషలో పుస్తకాలు రాసి సొంత డబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో 'రావ్ బహ దూర్' బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్పై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవర–ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారు చేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931లోను, సవర–ఇంగ్లీషు కోశాన్ని 1938లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్–ఇ–హింద్ ' అనే స్వర్ణ పతకాన్నిచ్చి గౌరవించింది.

# సాగు విధానాలపై జాతీయ చర్చ అవసరం

● ధాన్యం ఎగుమతులపై ఆంక్షలతో దక్కని ఫలితం

● పదేళ్లలో ఫలితం చూపని పథకాలు



**న్యూఢిల్లీ:** మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క రైతు అనుకూల నిర్ణయం తీసుకోలేదు. అప్పుడప్పుడూ మద్దతు ధరలు పెంచడం తప్ప చేసిందేమీ లేదు. రైతుల సంఘాల నుంచి వ్యతిరేకతలు, ఆందోళనలు వస్తున్నా చర్చించడం లేదు. సాగుచట్టాలు తీసుకుని వచ్చాక అవి ఎందుకు మంచివో చెప్పలేక పోయింది. వాటిని రద్దుచేస్తున్న సమయంలోనూ ఎందుకు రద్దు చేస్తుందో చెప్పలేదు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా జాతీయ సాగు విధానం తీసుకుని రావవడంలోనూ.. దేశీయంగా పంటలను ప్రోత్సహించడంలోనూ విఫలమయ్యింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోడీ పండించిన పంటలను కొనుగోలు చేసే దిక్కు లేకుండా చేసింది. దేశీయంగా పంటలు పండుతు న్నా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో దేశీ యంగానూ బియ్యం ధరలు పెరుగుతున్నాయి. ఇవన్నీ వైఫల్యాలుగానే చూడాలి. కార్పొరేట్ సంస్థలు తీసుకున్న వేల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేస్తుంది కానీ.. రైతు రుణాలను మాఫీ చేయదు. అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడు తున్నది. అలాగే ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతోంది. ఇది కర్షకుల ప్రభుత్వం అంటూనే కార్పొరేట్లకు దోచిపెట్టే ప్రయత్నాల్లో ఉంది. లాభాలు వచ్చే ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతున్నారు. ఎందుకు అమ్ముతున్నారో చెప్పడం లేదు. రైతులంటే బీజేపీ ప్రభుత్వానికి లెక్కలేదని విమర్శలు వస్తున్నా పట్టించుకోవడం లేదు. కార్మికుల సమ్మెలను ,రైతుల ఆందోళనలను పట్టించుకుని వారితో మాట్లాడడంలేదు. రైతుల్లో ఉన్న వ్యతిరేకతను ఆధారంగా చేసుకుని రాజకీయంగా వాడుకోవాలని విపక్షాలు చూస్తున్నాయి. నిజానికి రైతుల పక్షాన పోరాడితే మంచిదే. దేశంలో ప్రస్తుతం ఒక రాజకీయ ప్రత్యామ్నాయ అవసరం. బీజేపీ, కాంగ్రెస్ వంటివాటితో దేశానికి ప్రయోజనం లేదని తేలిపోయింది. బీజేపీ రాజకీయ లబ్దిపొందే ప్రయత్నాల్లో మాత్రమే ఉంది. అన్ని రాష్టాల్లో పాగా వేయడం ఎలా అన్న ప్రణాళికతో ముందుకు పోతున్నది. కాంగ్రెస్ సొంత సమస్యలతోనే సతమతం అవుతున్నది. ఈ నేపథ్యంలో రైతులను సంఘటితం చేయడం ద్వారా బిజెపికి ప్రయత్నామ్నాయంగా వారిని ఉద్యమ క్షేత్రాలుగా మలచాలి. రైతులు కేంద్రంగా ఒక ప్రత్నామ్నాయ వేదిక ఉండాలి. నిజానికి దేశంలోని రైతు సమస్యలను పరిష్కరించడం పాలకులకు పెద్దపని కాదు. దీంతో ఆర్థికంగా దేశం బలపడుతుంది. అలాగే ఉపాధి,ఉద్యోగ రంగాలు బలపడుతాయి. వ్యవసాయ అనుబంధరంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దిగుమతులను తగ్గుంచుకునే వీలుంటుంది. పప్పులు, నూనెలు అదేపనిగా దిగుమతి చేసుకునే అవసరం రాదు. కానీ కాంగ్రెస్ కావచ్చు, ప్రస్తుత బిజెపి కావచ్చ ఈ తరహా ఆలోచనలుచేయలేదు. వ్యవసాయం చేయని వారికి కూడా రైతుబంధు అందడం వల్ల లక్ష్యం దెబ్బతింది. తెలంగాణలో అందరికీ 24 గంటలపాటు విద్యుత్తు ఉచితంగా ఇస్తున్నారు. అయినా ఫలితం కానరావడం లేదు.

# పోలవరానికి తొలగిన అడ్డంకులు

నిధుల విడుదలతో ఇక పనుల్లో వేగం

త్వరగా పూర్తి చేసే సంకల్పంతో ప్రభుత్వం



**న్యూఢిల్లీ:** పోలవరం ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయినట్లుగా కనిపిస్తున్నాయి. చంద్రబాబునాయుడు పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రులతో జరిపిన చర్చల ఫలితంగా.. పెండింగ్ నిధులతో పాటు రూ. 12500 కోట్లను కేంద్రం విడుదల చేయనుంది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. పోలవరానికి సంబంధించి ఇది పెద్ద విజయంగా భావించాలి. దీంతో ఇక ప్రాజెక్ట్ పనులల్‌ఓ వేగం పుంజుకోనుంది. 2014 –19 మధ్య పరుగులు పెట్టిన పోలవరం ప్రాజెక్టు తర్వాత ఆగిపోయింది. ఐదేళ్ల సమయం వృధా అయింది. రివర్స్ టెండర్లకు వెళ్లి కాంట్రాక్టర్లను మార్చడంతో పనులు ఆగిపోయాయి. గైడ్ బండ్ కుంగిపోయింది. డయాఫ్రంవాల్ కూడా దెబ్బతిన్నది. చంద్రబాబు మళ్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పోలవరాన్ని ఎలా గట్టెక్కించాలా అన్నదనిపై విస్తృతంగా చర్చలు జరిపారు. ఉన్నతాధికారులతో అంచనాలు వేశారు. తర్వాత పలుమార్లు కేంద్రాన్ని కలిసి ప్రాజెక్టు స్థితిగతులపై వివరించారు. డీపీఆర్‌ను ఆమోదించాలని.. తక్షణం పనుల కొనసాగింపులకు రూ. 12500 కోట్లను విడుదల చేయడంతో పాటు పాత బిల్లులు రీఎంబర్స్ చేయాలని కోరారు. కేంద్రం తాజా కేబినెట్ భేటీలో ఆ మే–రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విభజన చట్టంలో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం .. జాతీయ హోదా ఇచ్చింది. సాధారణంగా జాతీయ హోదా ప్రాజెక్టుల్లో 90 శాతం కేంద్రం.. పది శాతం రాష్ట్రం పెట్టుకుంటాయి. అయితే తర్వాత ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా ఆ పది శాతం కూడా తామే పెట్టుకుంటామని కేంద్రం హామీ ఇచ్చింది. ఈ మే–రకు ముందుగా ప్రభుత్వం పనులు చేయించి బిల్లులు పెడితే.. కేంద్రం మంజూరు చేస్తూ వస్తోంది. గత ఐదేళ్లుగా ఈ బిల్లింగ్ సైకిల్ గాడితప్పింది. పనులేమీ చేయకపోవడంతో పెద్దగా బిల్లులు రావాల్సిన అవసరం లేకపోయింది. అయితే ఇప్పుడు ప్రాజెక్టును గాడిన పెట్టాలనుకున్న చంద్రబాబు.. పలుమార్లు కేంద్ర మంత్రులని కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రధాన మంత్రి కార్యాయం ఆదేశాల మేరకు ఆర్థికశాఖ పోలవరం నిధుల విషయాన్ని మంత్రి మండలి ముందు ఉంచింది. పోలవరం తొలి దశకు అవసరమయ్యే పూర్తి నిధులను అంచనా వేసి పోలవరం డీపీఆర్‌ను రూపొందించ డంతో.. అవసరమయ్యే పూర్తి నిధులకు పలు స్థాయిలలో ఆమోదముద్ర వేశారు. ఇప్పుడు కేంద్ర మంత్రి మండలి ఆమోదిస్ంచినందున వెంటనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టుకు ప్రత్యేకంగా బడ్జెట్లో నిధులు కేటాయించడం లేదు. 2016 తర్వాత నాబార్డుతో కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది. పోలవరంకు అయ్యే ఖర్చు నాబార్డు ఇస్తుంది. అయితే కేంద్రానికి రుణం రూపంలో ఇస్తుంది.. అది ఏపీరాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తోంది. దీంతో పోలవరం ప్రాజెక్టుకు ఇవ్వబోయే 12 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులను అడ్వాన్స్‌గా ఇవ్వాలని కోరుతున్నారు. ఆ నిధులు వస్తే ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# పాముకాటుకు గురైన కానిస్టేబుల్

## ఆస్పత్రిలో పరామర్శించిన గవర్నర్

**ములుగు, ప్రజానావ:** గవర్నర్ పర్యటనలో పాము కాటుకు గురై ములుగు ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పోలీస్ కానిస్టేబుల్ ప్రశాంత్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ,మంత్రి దనసరి సీతక్కతో కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. గవర్నర్ వెంట జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ షబరిష్, తదితరులు ఉన్నారు. కాగా, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ములుగు జిల్లా పర్యటనలో అపశ్రతి చోటు చేసుకుంది. గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘ టనలు చోటు చేసుకోకుండా గ్రేహౌండ్స్‌తో అధికారులు ముందస్తుగా భారీగా భద్రతా దళాలను మోహరించారు. వెంకటాపూర్ మండలంలోని దట్టమైన అడవిలో విధుల్లో ఉన్న గ్రేహౌండ్ పోలీస్ కానిస్టేబుల్ గుండ్ల ప్రశాంత్ అనే వ్యక్తికి పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి సిబ్బంది హుటాహుటున కానిస్టేబుల్‌ను ములుగు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు తరలించి వైద్యమందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు.

# తిరుమలలో కొత్త రకం మోసం

## లాకర్ల పేరుతో డబ్బులు గుంజుతున్న వ్యక్తి అరెస్ట్

**తిరుమల, ప్రజానావ:** తిరుమలలో కొత్త రకం మోసం వెలుగుచూసింది. లాకర్ల పేరుతో భక్తుల నుంచి డబ్బులు గుంజుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తిలక్‌గా గుర్తించారు. తిరుమలకు వచ్చి లాకర్లు తీసుకున్న భక్తులకు తిలక్ టీటీడీ ఉద్యోగిగా ఫోన్ చేస్తాడు. లాకర్ నిర్ణీత గడువులోగా ఖాళీ చేయలేదు కాబట్టి ÷న్ కట్టాలని బెదిరిస్తాడు. అలా భక్తులను తన వద్దకు పిలిపించుకుని వారి దగ్గర నుంచి డబ్బులు తీసుకుంటున్నాడు. ఓ మహిళా భక్తురాలికి తిలక్ ఇలాగే కాల్ చేసి బెదిరించడంతో.. అనుమానం వచ్చిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కాగా, అసలు భక్తుల వివరాలు తిలక్ వద్దకు ఎలా వెళ్లాయనే దానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో టీటీడీ ఉద్యోగుల హస్తం ఏమైనా ఉందా? అనే కోణంలోనూ విచారిస్తున్నారు.

www.prajanaava.in
హైదరాబాద్ గురువారం, ఆగస్టు 29, 2024
ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం...




**ముంబై:** ఐపీఎల్ 2025 మెగావేలానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ సమాయత్తమవుతోంది. ఐపీఎల్ 2024 సీజన్‌లో అసాధారణ ప్రదర్శనతో ఫైనల్ చేరి తృటిలో టైటిల్ చేజార్చుకున్న సన్‌రైజర్స్ రన్నరప్‌గా నిలిచింది. 2016, 2018 సీజన్ల తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ మెరుగైన ప్రదర్శన చేసిన సీజన్ ఇదే. ప్యాట్ కమిన్స్ సారథ్యంలో సన్‌రైజర్స్ దుమ్మురేపింది విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆల్‌టైమ్ రికార్డ్ స్కోర్స్ నమోదు చేసింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, నితీష్ కుమార్ రెడ్డి, హెన్రీచ్ క్లాసెన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక స్కోర్ రికార్డ్ అందుకుంది. ఈ అసాధారణ ప్రదర్శన నేపథ్యంలోనే మెగా వేలాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ వ్యతిరేకించింది. కనీసం 8 మంది ఆటగాళ్లనైనా రిటైన్ చేసుకునే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేసింది. కానీ మెగా వేలం రూల్స్ ప్రకారం నలుగురిని మాత్రమే రిటైన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు అయితే బీసీసీఐ ఇంకా రిటెన్షన్ పాలసీని ప్రకటించలేదు. కానీ నలుగురి కంటే ఎక్కువ రిటైన్ చేసుకునే ఛాన్స్ ఉండదని తెలుస్తోంది. నలుగురికి మాత్రమే అవకాశం ఇస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌తో పాటు

## సన్‌రైజర్స్ హైదరాబాద్
# రిటైన్ ఆటగాళ్లు ఎవరు?

అనామక ప్లేయర్ అయిన నితీష్ కుమార్ రెడ్డి, విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, హెన్రీచ్ క్లాసెన్‌లను రిటైన్ చేసుకునే ఛాన్స్ ఉంది. ఆర్‌టీఎమ్ కింద మరో ప్లేయర్‌ను తీసుకునే అవకాశం ఇస్తే నటరాజన్, ట్రావిస్ హెడ్‌ల్లో ఒకరిని తీసుకుంటుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ రిటైన్ చేసుకునే తొలి ఆటగాడు ప్యాట్ కమిన్స్. అప్‌కమింగ్ సీజన్‌లోనూ అతన్నే కెప్టెన్‌గా కొనసాగించే అవకాశం ఉంది. అయితే సన్‌రైజర్స్ రిటెన్షన్‌కు ప్యాట్ కమిన్స్ ఒప్పుకుంటాడా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మెగా వేలంలో సమయంలో ప్యాట్ కమిన్స్ దూరంగా ఉంటాటు. మినీ వేలం సందర్భంగా రీఎంట్రీ ఇస్తూ.. భారీ ధరను సొంతం చేసుకుంటాడు. రిటైన్షన్ లిస్ట్ ఓ అనామక ప్లేయర్‌ను తీసుకోవాలనే రూల్ ఉంటుంది. అది ఈసారి కూడా అమలు చేస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆ ఆప్షన్ కింద నితీష్ కుమార్ రెడ్డిని ఎంచుకుంటుంది. నాలుగో ప్లేయర్‌గా అతన్ని రిటైన్ చేసుకుంటుంది. మూడో రిటెన్షన్‌గా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎంచుకోనుంది. ఐపీఎల్ 2024 సీజన్‌లో అతను అసాధారణ ప్రదర్శన కనబర్చాడు.విధ్వంసకర వికెట్ కీపర్ హెన్రీచ్ క్లాసెన్‌ను కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ కొనసాగించనుంది. విధ్వంసకర బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్ జట్టుకు కలిసిరానుంది.

# లక్నో జెయింట్స్ మెంటార్‌గా జహీర్

**ముంబై:** లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ కొత్త మెంటార్‌గా టీమిండియా మాజీ స్టార్ బౌలర్ జహీర్ ఖాన్ ఎంపికయ్యాడు. త్వరలోనే అతను ఈ బాధ్యతలు అందుకోనున్నాడు. భారత క్రికెట్‌పై తనదైన ముద్ర వేసిన జహీర్ త్వరలో మెంటార్ అవతారమెత్తనున్నాడు. జహీర్ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని లక్నో సూపర్‌జెయింట్స్ యాజమాన్యం అతనికి కీలకమైన మెంటార్ బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని లక్నో ఫ్రాంచైజీ యాజమాన్యం తన సోషల్ మీడియా ఖాతాలో అధికారికంగా వెల్లడించింది. రానున్న ఐపీఎల్ సీజన్ నుంచి జహీర్ బాధ్యతలు చేపడుతాడని యాజమాన్యం వివరించింది. కిందటి ఐపీఎల్ సీజన్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ ఆశించిన స్థాయి-ంలో రాణించలేక పోయింది. కేఎల్ రాహుల్ సారథిగా సత్తా చాటలేక పోయాడు. ఈసారి రాహుల్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుంటాడనే వార్తలు వినవస్తున్నాయి. ఇలాంటి స్థితిలో జట్టును మళ్లీ గాడిలో పెట్టేందుకు లక్నో యాజమాన్యం కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అపార అనుభజ్ఞుడైన జహీర్‌ను జట్టు మెంటార్‌గా ఎంపిక చేసింది. టీమిండియాలోనే కాకుండా ఐపీఎల్‌లోనూ జహీర్ మెరుగైన ప్రదర్శనతో అలరించాడు. ఐపీఎల్‌లో వంద మ్యాచ్‌లు ఆడిన జహీర్ 102 వికెట్లను పడగొట్టాడు. ఐపీఎల్‌లో జహీర్, ముంబై, బెంగళూరు, ఢిల్లీ జట్లకు ప్రాతినిథ్యం వహించాడు.





## చివరి మ్యాచ్‌లోనూ
# సఫారీ చిత్తు

### టీ20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన వెస్టిండీస్

**ట్రినిడాడ్:** సౌతాఫ్రికాతో జరిగిన మూడో, చివరి టీ20లో ఆతిథ్య వెస్టిండీస్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో విండీస్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 13 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 13 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. ఓపెనర్ రికెల్టన్ (27) పరుగులు చేశాడు. చెలరేగి ఆడిన ట్రిస్టన్ స్టబ్స్ 15 బంతుల్లోనే 3 సిక్సర్లు, ఐదు ఫోర్లతో 40 పరుగులు సాధించాడు. కెప్టెన్ మార్‌క్రమ్ (20) పరుగులు చేశాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 9.2 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ షాయ్ హోప్ మరోసారి దూకుడుగా ఆడాడు. ప్రత్యర్థి టీమ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న హోప్ 24 బంతుల్లోనే 4 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 42 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వికెట్ కీపర్ నికోలస్ పూరన్ కూడా దూకుడుగా ఆడాడు. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగిన పూరన్ 13 బంతుల్లోనే 4 సిక్స్‌లు, రెండు ఫోర్లతో 35 పరుగులు చేశాడు. ధాటిగా ఆడిన హెట్‌మెయిర్ 17 బంతుల్లో 4 బౌండరీలు, ఒక సిక్సర్‌తో 31 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో విండీస్ హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. బౌలింగ్‌లో రాణించిన రొమారియో షెఫర్డ్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, షాయ్ హోప్ ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు లభించింది.

## 223 స్ట్రైక్‌రేట్‌తో ఐపీఎల్ ఫ్రాంచైజీల
# హార్ట్‌బీట్ పెంచేశాడు



**బెంగళూరు:** మహారాజా టీ20 ట్రోఫీ 25వ మ్యాచ్‌లో శివమొగ్గ లయన్స్ 6 వికెట్ల తేడాతో గుల్బర్గా మిస్టిక్స్‌పై విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గుల్బర్గా 20 ఓవర్లలో 206 పరుగులు చేసింది. అయినప్పటికీ, శివమొగ్గ లయన్స్ 5 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను సులభంగా గెలుచుకుంది. ప్రత్యర్థి బౌలర్లపై విధ్వంసం సృష్టించిన అభినవ్ మనోహర్ శివమొగ్గ లయన్స్ విజయంలో అతిపెద్ద సహకారం అందించాడు. అభినవ్ మనోహర్ కేవలం 34 బంతుల్లో 9 సిక్సర్లు, 2 ఫోర్లతో అజేయంగా 76 పరుగులు చేశాడు. 207 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన శివమొగ్గ లయన్స్ ఒక్కసారిగా 12.1 ఓవర్లలో 100 పరుగులకు ఆలౌటైంది. అంటే, తర్వాతి 47 బంతుల్లో స్కోరు 107 పరుగులకు చేరుకుంది. టాస్క్ కష్టమైనా అభినవ్ మనోహర్ క్రీజులో ఉండడంతో ఆందోళన చెందాల్సిన పనిలేదు. మనోహర్ కేవలం 27 బంతుల్లో 6 సిక్సర్ల సాయంతో 50 పరుగులు పూర్తి చేసి ఆ తర్వాత 3 సిక్సర్లు, 2 ఫోర్లు బాది జట్టుకు విజయాన్ని అందించాడు. ఈ టోర్నీలో అభినవ్ మనోహర్ 9 మ్యాచ్‌ల్లో అత్యధికంగా 448 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు అభినవ్ మనోహర్ అత్యధికంగా 45 సిక్సర్లు బాదడం విశేషం. అంటే అతను ప్రతి మ్యాచ్‌లో సగటున 5 సిక్సర్లు కొట్టాడు. అభినవ్ మనోహర్ స్ట్రైక్ రేట్ కూడా దాదాపు 200లుగా ఉంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. టోర్నీలో అభినవ్ ఇప్పటి వరకు 10 ఫోర్లు మాత్రమే కొట్టాడు. అంటే, ఈ ఆటగాడు కేవలం సిక్సర్లతోనే డీల్ చేశాడు అన్న మాట. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టులో అభినవ్ మనోహర్ సభ్యుడు. ఐపీఎల్ 2024లో అతనికి కేవలం 2 మ్యాచ్‌ల్లో మాత్రమే అవకాశం లభించింది. శుభ్‌మన్ గిల్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. అతని నాయకత్వంలో అభినవ్‌కు పూర్తి అవకాశాలు రాలేదు. ఇప్పుడు ఈ ఆటగాడు తన సత్తా చాటుతున్నాడు. 2025 వేలానికి ముందు, అతని ఇన్నింగ్స్ ఖచ్చితంగా ఫ్రాంచైజీలను ఆకర్షిస్తుంది.


## విద్యార్థికి సహాయం చేసిన పంత్.. గంటలోపే రిటర్న్!

**న్యూఢిల్లీ :** తన కాలేజీ ఫీజు కట్టడానికి ఎంతో కష్టపడుతు న్నానని సాయం చేయాలంటూ ఓ విద్యార్థి భారత క్రికెటర్ రిషభ్ పంత్‌ని ట్యాగ్ చేస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టాడు. దీనికి పంత్ స్పందించిన తీరు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అయితే, ఆ విద్యార్థి పంత్ ఇచ్చిన డబ్బును తిరిగి చెల్లిస్తానని ప్రకటించడం కొసమెరుపు. కార్తికేయ మౌర్య అనే విద్యార్థి తన ఎక్స్ ఖాతాలో కెట్టో లింక్‌ను షేర్ చేసి పంత్ సాయం కోరాడు. “హలో.. నేను కార్తికేయ మౌర్య. చండీగఢ్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్నా. నా కుటుంబంపై ఆధారపడకుండా ఎస్‌ఈవో స్పెషలిస్ట్‌గా పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ చదువు కొనసాగిస్తున్నా. గత కొన్ని నెలలుగా స్థిరమైన ఉపాధి లేక నా చదువు మధ్యలోనే ఆగిపోయింది. మీ సాయం నా జీవితా న్ని మార్చగలదు” అంటూ అతడు పెట్టిన పోస్ట్‌కు పంత్ స్పందించాడు. ఆ విద్యార్థికి సాయం చేశాడు. ‘మీ కలలను నేరవేర్చుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉండండి. దేవుడు మంచి ప్రణాళికలు సిద్ధం చేసే ఉంటాడు’ అంటూ పంత్ రీపోస్ట్ చేశాడు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో పలువురు నెటిజన్లు ఆ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘జాతీయ స్థాయి ఆటగాడిని మోసం చేయడానికి సిగ్గు లేదా?’ అంటూ అతడిపై కొందరు ట్రోల్ చేశారు. దీనికి స్పందించిన సదరు విద్యార్థి.. ‘ఇం త ద్వేషాన్ని భరించలేను. కెట్టోలో రిఫండ్ చేసే అవకాశం లేదు. వాళ్లకు మెయిల్ చేశాను. అనుమ తి రాగానే ఆ డబ్బును తిరిగి ఇచ్చేస్తాను. క్షమించం డి!’ అని ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేయడం గమనార్హం.



## జైషాకు అభినందనల వెల్లువ

**ముంబై:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఛైర్మన్‌గా ఎంపికైన భారత క్రికెటర్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి జైషాకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. టీమిండియాకు చెందిన స్టార్ క్రికెటర్లు జైషాకు అభినందనలు తెలిపారు. 35 ఏళ్ల వయసులోనే జైషా అత్యంత కీలకమైన ఐసీసీ ఛైర్మన్ పదవిని దక్కించుకుని ప్రకంపనలు సృష్టించారు. జైషాను పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్య తదితరులు ఉన్నారు. జైషా మరిన్ని ఇంకా ఎన్నో గొప్ప విజయాలు సాధిచాలని వారు ఆకాంక్షించారు. ఆటలపై జైషాకు ఉన్న అభిరుచిని కోహ్లి, బుమ్రాలు ప్రశంసించారు. ఆయన పర్యవేక్షణలో ప్రపంచంలో క్రికెట్ మరింత అభివృద్ధి సాధిస్తుందనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. కాగా, ప్రస్తుతం బీసీసీఐ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జైషా డిసెంబర్ ఒకటిని ఐసీసీ ఛైర్మన్ పదవి బాధ్యతలను చేపడుతారు. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఐసీసీ పాలక మండలి సమావేశంలో జైషాను ఛైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## క్రికెట్‌కు మలన్ గుడ్‌బై

**లండన్:** ఇంగ్లండ్ స్టార్ క్రికెటర్ డేవిడ్ మలన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 37 ఏళ్ల మలన్ మూడు ఫార్మాట్లలోనూ ఇంగ్లండ్‌కు ప్రాతినిథ్యం వహించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మలన్ మెరుగైన క్రికెటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. టీ20ల్లో మలన్‌కు మంచి రికార్డు ఉంది. పొట్టి క్రికెట్‌లో అత్యంత వేగంగా 1000 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా మలన్ చరిత్ర సృష్టించాడు. మలన్ 24 ఇన్నింగ్స్‌లలోనే ఈ మైలురాయిని అందుకున్నాడు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657